జాతీయ తెలుగు దినపత్రిక
RNI - TGTEL/25/A0348

# సందేశ టైమ్స్

నిజం దాగదు – వార్త ఆగదు

తెలుగు పత్రికా రంగంలో నూతనంగా అడుగుపెట్టి విశేష ప్రజాదరణతో ముందుకు సాగుతున్న మన 'సందేశం టైమ్స్' తెలుగు దిన పత్రికలో పని చేయుటకు రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయి స్టాఫ్ రిపోర్టర్స్ కావలెను. అలానే మండల స్థాయి రిపోర్టర్స్ కావలెను.కొత్త వారికీ అవకాశం కలదు
ఎడిటర్ : 90520 45435

PUBLISHED: TG & AP | సంపుటి : 1 | సంచిక: 73 | మంగళవారం 5 ఆగస్టు - 2025 | పేజీలు : 8 | వెల 2 /-

Published from :Adilabad, Bhadradri Kothagudem, Hanumakonda, Hyderabad, Jagtial, Jangaon, Jayashankar Bhupalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahbubnagar, Mancherial, Medak, Medchal-Malkajgiri, Mulugu, Nagarkurnool, Nalgonda, Narayanpet, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla, Ranga Reddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal, and Yadadri Bhuvanagiri.

## వినీతి, ఆశ్రిత పక్షపాతంతోనే ప్రాజెక్ట్ నిర్మాణం: సీఎం రేవంత్ రెడ్డి



హైదరాబాద్, ఆగస్ట్ 04,సందేశం టైమ్స్ : అవినీతి, ఆశ్రిత పక్షపాతంతోనే గత బీఆర్ఎస్ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్ట్‌ను నిర్మించిందని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి విమర్శించారు. మూడేళ్లలోనే మేడిగడ్డ బ్యారేజ్ కుంగిపోయిందని గుర్తు చేశారు. అన్నారం, సుందిళ్ల బ్యారేజ్‌లలో సైతం పగుళ్లు వచ్చాయన్నారు. రీ డిజైనింగ్ పేరుతో ప్రాజెక్ట్ నిర్మాణాన్ని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మార్చారని స్పష్టం చేశారు. సోమవారం హైదరాబాద్‌లో కేబినెట్ సమావేశం అనంతరం ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్‌లో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లో సైతం లోపాలున్నాయని ఎన్‌డీఎస్‌ఏ నివేదిక ఇచ్చిందని వివరించారు. వీటిలో ప్లానింగ్, నిర్మాణం, నిర్వహణ లోపాలున్నాయని తేలిందని చెప్పారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందే ఈ ప్రాజెక్టల నిర్మాణంపై విచారణ చేయిస్తామని తమ మేనిఫెస్టోలో స్పష్టం చేశామని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీష్‌రావు సహా అనేక మందిని జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ప్రశ్నించిందని తెలిపారు. 16 నెలల విచారణ అనంతరం 665పేజీల నివేదికను ప్రభుత్వానికి అందజేశారని చెప్పారు. ఈ కమిషన్ రిపోర్ట్‌పై అధ్యయనానికి ముగ్గురు అధికారులతో కమిటీ వేశామన్నారు. ఊరు,పేరుతోపాటు చివరకు అంచనాలు సైతం మార్చి అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారంటూ బీఆర్ఎస్ అగ్రనేతలపై సీఎం రేవంత్ రెడ్డి మండిపడ్డారు.

అలా నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్ట్ వారి హయాంలోనే కూలిందని తెలిపారు. కాళేశ్వరం కమిషన్ నివేదికకు తెలంగాణ కేబినెట్ ఆమోదం తెలిపిందన్నారు. కాళేశ్వరం కమిషన్ నివేదికపై అసెంబ్లీలో చర్చిస్తామని స్పష్టం చేశారు. ఆ క్రమంలో అన్ని పార్టీల అభిప్రాయాలు, సూచనలు సైతం తీసుకుంటామని పేర్కొన్నారు. అసెంబ్లీలో చర్చించిన తర్వాతే దీనిపై నిర్ణయం తీసుకుంటామని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టత ఇచ్చారు. ప్రజా ప్రతినిధులకు ఈ కమిషన్ నివేదిక అందజేస్తామన్నారు. అందరూ స్వేచ్ఛగా అభిప్రాయాలు చెప్ప వచ్చునని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు.

## కాళేశ్వరం నివేదికపై ఆరోపణలు.. బీఆర్ఎస్ పార్టీ సంచలన నిర్ణయం

హైదరాబాద్,ఆగస్ట్ 04,సందేశం టైమ్స్ : కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై ప్రభుత్వానికి జస్టిస్ పీసీ ఘోష్ అందించిన నివేదికతో తెలంగాణ రాష్ట్రంలో రాజకీయం వేడెక్కింది. ఈ నివేదికపై ముగ్గుర ఉన్నతాధికారులతో ప్రభుత్వం కమిషన్ ఏర్పాటు చేసింది. ఈ కమిషన్ సైతం తన నివేదికను సోమవారం జరిగిన కేబినెట్ ముందు ఉంచింది. దీంతో రాష్ట్ర రాజకీయం మరింత వేడెక్కింది.అయితే ఈ రెండు నివేదికల్లో బీఆర్ఎస్ పార్టీ చీఫ్, మాజీ సీఎం కేసీఆర్ పేరు పేరు అత్యధిక సార్లు పేర్కొన్నారు. అంతేకాకుండా.. లక్షల కోట్ల రూపాయిలతో ఈ ప్రాజెక్ట్ నిర్మించి ప్రజాధనాన్ని వృథా చేశారంటూ ఇప్పటికే అధికార, విపక్ష పార్టీ బీజేపీ నేతలు.. బీఆర్ఎస్‌పై నిప్పులు చెరుగుతున్నారు.అలాంటి వేళ.. బీఆర్ఎస్ పార్టీ




కీలక నిర్ణయం తీసుకుంది. అందులోభాగంగా రేపు.. అంటే మంగళవారం తెలంగాణ భవన్‌లో కాళేశ్వరం కమిషన్ నివేదికపై ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీష్‌రావు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఇవ్వనున్నారు. రేపు మధ్యాహ్నం 12.00 గంటలకు ఆయన ఈ ప్రెజెంటేషన్ ఇవ్వనున్నారు. ఇక ఈ ప్రెజెంటేషన్‌ను అన్ని నియోజకవర్గాల్లో.. బహిరంగంగా ప్రదర్శించాలని పార్టీ ఆదేశించింది. ఈ నేపథ్యంలో అందుకు సంబంధించిన ఏర్పాట్లు యుద్ధ ప్రాతిపదికన ఏర్పాట్లు చేస్తున్నారు.

## రాష్ట్రంలో 84% మందికి సన్న బియ్యం - ఉత్తమ్



ఆగస్ట్ 04,సందేశం టైమ్స్ : తెలంగాణలో రేషన్ పంపిణీ వ్యవస్థపై రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంది. రాష్ట్ర జనాభాలో 84 శాతం మందికి నాణ్యమైన సన్న బియ్యం పంపిణీ చేస్తున్నట్లు రాష్ట్ర మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 89 లక్షల రేషన్ కార్డులు ఉండగా, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఆ సంఖ్య 98.59 లక్షలకు పెరిగిందని పేర్కొన్నారు. తమ ప్రభుత్వం కొత్తగా 8.64 లక్షల కొత్త రేషన్ కార్డులను జారీ చేసిందని ఆయన వివరించారు.

బీఆర్ఎస్ హయాంలో నాసిరకం, ఇప్పుడు నాణ్యమైన సన్న బియ్యం గత బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో 2.81 కోట్ల మంది ప్రజలకు నాసిరకమైన దొడ్డు బియ్యాన్ని పంపిణీ చేశారని మంత్రి ఉత్తమ్ విమర్శించారు. అయితే, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని నాణ్యమైన సన్న బియ్యాన్ని పంపిణీ చేస్తున్నామని ఆయన తెలిపారు. ఇప్పుడు 3.17 కోట్ల మంది లబ్ధిదారులకు ఈ నాణ్యమైన సన్న బియ్యం అందుతోందని ఆయన వెల్లడించారు. ఈ నిర్ణయం ద్వారా పేదలకు మెరుగైన ఆహారాన్ని అందించడమే కాకుండా, వారి ఆరోగ్యాన్ని కూడా ప్రభుత్వం పరిగణనలోకి తీసుకున్నట్లు స్పష్టమవుతోంది.

## బీసీ బిల్లు సాధన కోసం కవిత నిరాహార దీక్ష



తెలంగాణ,ఆగస్ట్ 04,సందేశం టైమ్స్ : తెలంగాణ రాష్ట్రంలో విద్య, ఉద్యోగాలు, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌ను కేంద్రం ఆమోదించాలని డిమాండ్ చేస్తూ . భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) ఎమ్మెల్సీ, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సోమవారం ఉదయం ధర్నాచౌక్ వద్ద 72 గంటల నిరాహార దీక్షను చేపట్టారు. ముందుగా బీఆర్ అంబేద్కర్, ఫులే, ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహాలకు ఆమె నివాళి అర్పించారు. ఈ దీక్షకు పెద్దఎత్తున కార్యకర్తలు, తెలంగాణ జాగృతి శ్రేణులు తరలివచ్చి ఆమెకు మద్దతు ప్రకటించారు. తెలంగాణ అసెంబ్లీలో 2025 మార్చి 17న రెండు బిల్లులను ఆమోదించారు. 'తెలంగాణ బ్యాక్‌వర్డ్ క్లాసెస్, షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల (విద్యా సంస్థల్లో సీట్లు, రాష్ట్ర సర్వీసుల్లో నియామకాల కోసం రిజర్వేషన్) బిల్లు, 2025' అలాగే 'తెలంగాణ బ్యాక్‌వర్డ్ క్లాసెస్ (గ్రామీణ, పట్టణ స్థానిక సంస్థల్లో సీట్ల రిజర్వేషన్) బిల్లు, 2025' ఇవి రెండూ ఇప్పటికీ రాష్ట్రపతి ఆమోదం కోసం పెండింగ్‌లో ఉన్నాయి. ఈ బిల్లులు బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌ను అమలు చేయడానికి ఉద్దేశించినవి. వీటిని రాష్ట్రపతి ఆమోదించాలని డిమాండ్ చేస్తూ.. కవిత ఈ దీక్ష చేపట్టారు.

## సిరాజ్ పై తెలంగాణ పోలీస్ డిపార్ట్ మెంట్ ప్రశంసలు



ఆగస్ట్ 04,సందేశం టైమ్స్ : టీమిండియా స్టార్ పేసర్ మహ్మద్ సిరాజ్ ఇటీవలి ఇంగ్లండ్ టెస్టు సిరీస్‌లో అసాధారణంగా రాణించి దేశానికి గర్వకారణంగా నిలిచాడు. హైదరాబాద్ ముద్దుబిడ్డగా పేరొందిన ఈ యువ బౌలర్ ఆఖరి టెస్టులో ఐదు కీలక వికెట్లు తీసి జట్టును విజయం వైపుకు నడిపించాడు. అంతర్జాతీయ స్థాయిలో గణనీయమైన విజయాన్ని అందించిన ఈ ప్రదర్శనకు తెలంగాణ పోలీస్ శాఖ హర్షాతిరే కంతో స్పందించింది.కేవలం క్రికెటర్‌గానే కాదు, మహ్మద్ సిరాజ్ తెలంగాణ పోలీస్ శాఖలో డీఎస్పీ హోదాలో సేవలందిస్తున్న సంగతి తెలిసిందే. ఈ ఘనతతో ఆయన సాధారణ ఆటగాడిగా కాకుండా, విధుల్లోనూ నిబద్ధత చూపిన వ్యక్తిగా గుర్తింపు పొందుతున్నాడు. ఇదే కారణంగా, అధికారిక సోషల్ మీడియా ద్వారా సిరాజ్‌కి ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.

## అవయవ దానాల్లో తెలంగాణ టాప్ !!

ఆగస్ట్ 04,సందేశం టైమ్స్ : తెలంగాణ రాష్ట్రం అవయవ దానాల్లో దేశంలోని ఇతర రాష్ట్రాలకన్నా ముందంజలో ఉంది. రాష్ట్రంలో నిర్వహిస్తున్న 'జీవన్ దాన్' కార్యక్రమంతో తెలంగాణ జాతీయ స్థాయిలో అగ్రస్థానాన్ని సాధించింది. ఈ ఘనతను గుర్తించి కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి జేపీ నడ్డా, ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో తెలంగాణ జీవన్ దాన్ అధికారులకు అవార్డు ప్రదానం చేశారు.ఈ కార్యక్రమంలో నేషనల్ ఆర్గాన్ అండ్ ఇష్యూ ట్రాన్స్‌ప్లాంట్ ఆర్గనైజేషన్ ప్రకటించిన గణాంకాల ప్రకారం, తెలంగాణ రాష్ట్రం మిలియన్ జనాభాకు 4.88 రేటుతో దేశంలోనే అగ్రస్థానాన్ని దక్కించుకుంది. జాతీయ సగటు కేవలం 0.8గా ఉండగా, తెలంగాణ దాన్ని ఐదు రెట్లు మించి నిలవడం విశేషం. అందుకే తెలంగాణకు కేంద్ర ఆరోగ్య మంత్రి జేపీ నడ్డా చేతుల మీదుగా ప్రత్యేక అవార్డు లభించింది.2012లో ప్రారంభమైన జీవన్ దాన్ కార్యక్రమం ఇప్పటివరకు 673 దోనర్ల నుండి సేకరించిన అవయవాలతో 6309 మందికి ప్రాణాలు నిలిపింది. బ్రెయిన్ డెత్ అయినవారి అవయవాలను గుర్తించి, కుటుంబ సభ్యులను ఒప్పించి, అవసరమైన వారికి వాటిని వేగంగా అందించడంలో ఈ కార్యక్రమం కీలక పాత్ర

# కేంద్రం సంక్షేమ పథకాలు ఇంటింటా ప్రచారం

## బీజేపీ పార్టీ మండల్ అధ్యక్షులు కె అశోక్ కుమార్





సందేశం టైమ్స్:సంగారెడ్డి జిల్లా ప్రతినిధి 4ఆగస్టు సంగారెడ్డి జిల్లా వట్పల్లి మండల్ బీజేపీ పార్టీ అందోల్ నియోజకవర్గం మండల కేంద్రంలో మహా సంపర్క్ అభియాన్ లో భాగంగా మండల అధ్యక్షులు అశోక్ కుమార్ నేతృత్వంలో భాజపా కేంద్ర పార్టీ చేపట్టినటువంటి అభివృద్ధి సంక్షేమ పథకాలను ఇంటింటి గడపకు తిరిగి బీజేపీ నాయకులు ఇరోజు ప్రచారం చేసి ప్రజలకు తెలియజేయడం జరిగిందిఈ సంక్షేమ పథకాలు ప్రతి బూతులో మరియు ఓటర్లకు ప్రతి వాడకు తిరిగి ప్రచారం చేస్తామని అలాగే ప్రజల్లో చైతన్యం తీసుకొస్తామన్నారు లోకల్ బాడీ ఎన్నికల్లో మా నాయకులందరం కలిసి కష్టపడి పనిచేసి విజయం సాధిస్తామని ఆయన అశోక్ కుమార్ వెల్లడించారు.ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఆందోల్ అసెంబ్లీ కన్వీనర్ మఠం చంద్రశేఖర్, జిల్లా కౌన్సిల్ మెంబర్ సురేష్ గౌడ్,బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షులు పట్లోళ్ల అరవింద్ పటేల్, బీజేవైఎం అసెంబ్లీ కో కన్వీనర్ అనిల్ కుమార్,మండల ప్రధాన కార్యదర్శిలు యాదయ్య%ఢ%నగేష్ చారి సీనియర్ నాయకులు శివమూర్తి, నర్సింలు, నాగరాజు, వినయ్, ఆంజనేయులు, సోషల్ మీడియా కన్వీనర్ శశిధర్,పాలడుగు ఉప సర్పంచ్ ఆగమయ్య, సంగమేశ్వర్, మండల బీజేపీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# సంగారెడ్డి తారాప్రభుత్వలో కళాశాల క్యారియర్






సందేశం టైమ్స్ : సంగారెడ్డి నియోజకవర్గ ఇన్చార్జి 4ఆగస్టు: సంగారెడ్డి తార ప్రభుత్వం కళాశాలలోగైడెన్స్ సెల్, టి .ఎస్ .కె. సి. గణిత శాస్త్ర మరియు ఆంగ్ల భాష విభాగాల ఆధ్వర్యంలో ఫైనల్ ఇయర్ డిగ్రీ విద్యార్థుల కోసం ఐ సి ఈ టి ఎం.బీ.ఏ. ఒరియెంటేషన్ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడిందని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి రమేష్ తెలిపినారు.ఈ కార్యక్రమంలో ఆర్.కరుణ విద్యార్థులకు ఐ సి ఈ టి పరీక్షకు సిద్ధమయ్యే విధానాన్ని వివరించారు.కళాశాల ప్రిన్సిపాల్ డా. పి.రమేశ్ డిగ్రీ అనంతరంలో ఉన్న వివిధ అవకాశాలు, పరీక్షలు, వాటి సన్నాహకాలపై స్పష్టతతో అవగాహన కల్పించారు. వైస్ ప్రిన్సిపాల్ డా. జగదీశ్వర్ విద్యార్థుల్లో అంకితభావం మరియు శ్రమించడం వలన ఎలా ఉన్నత శిఖరాలను చేరుకోవచ్చో తెలిపారు.ప్రధాన వక్తగా పాల్గొన్న టి ఐ ఎం ఈ సంస్థకు చెందిన శ్రీ హుస్సేన్ గారు మేనేజ్‌మెంట్ ప్రవేశ పరీక్షల నిర్మాణం, పరీక్షలో వచ్చే అంశాలు మరియు వాటికి అవసరమైన సిద్ధతపై వివరించారు. ఈ కార్యక్రమాన్ని .టైం. ఇన్స్టిట్యూట్‌కు చెందిన శ్రీ ఇబ్రాహీం సమన్వయం చేశారు.కార్యక్రమంలో ప్లేస్‌మెంట్ కోఆర్డినేటర్ డా. రత్న ప్రభాకర్, డా. సుచిత్ర సింగ్, డా. సుజాత్ (బి బి ఏ ఫ్యాకల్టీ) మరియు డిగ్రీ విద్యార్థులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతంగ చేశారు.

# ప్రజావాణి లో 99 ధరఖాస్తులు.....





సందేశం టైమ్స్ , సూర్యాపేట జిల్లా: ప్రజావాణి లో 99 ధరఖాస్తులు..... అల్బెండాజోల్ టాబ్లెట్ ద్వారా పిల్లలలో నులిపురుగుల నివారణ....నిరుద్యోగులకి పోర్టల్ ద్వారా ఉ ద్యోగ సమాచారం....అధికారులు క్షేత్ర స్థాయి పర్యటనలు చేయాలి....ప్రజావాణి అర్జీలను వేగవంతం గా పరిష్కరించాలి.....జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అల్బెండాజోల్ టాబ్లెట్ తీసుకోవటం ద్వారా పిల్లలలో నులిపురుగులను నివారించవచ్చని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ సూచించారు.సోమవారం కలెక్టరేట్ సమావేశం మందిరంలో నిర్వహించిన ప్రజవాణి కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ పి రాంబాబు తో కలిసి జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నులి పురుగులు శరీరంలోకి ప్రవేశించి పిల్లలలో బలహీనత, రక్తహీనత, ఆకలి లేకపోవడం వంటి సమస్యలకు లోనవుతారని ప్రభుత్వం ప్రతి సంవత్సరం ఆగస్టు 11 న “జాతీయ డీవార్మింగ్ డే” నిర్వహిస్తుందని తెలిపారు. డి ఈ ఓ, డి ఎం హెచ్ ఓ, డి డబ్ల్యూ ఓ, రెసిడెన్సీయల్ కో ఆర్డినేటర్లు సమన్వయము చేసుకుంటూ ఉపాధ్యాయులు, అంగన్వాడీ టీచర్లు, హాస్టల్ వార్డెన్స్ ద్వారా సమావేశం నిర్వహించి అంగన్వాడీ కేంద్రాలలో, ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలల్లో,రెసిడెన్సీ యల్ హాస్టల్లో ఉన్న ప్రతి పిల్లవాడికి వైద్య సిబ్బంది ద్వారా అల్బెండాజోల్ టాబ్లెట్లు అందించాలని ఆదేశించారు.నిరుద్యోగ యువత ప్రైవేట్ రంగంలో ఉద్యోగ సమాచారం కొరకు (డిజిటల్ ఎంప్లయ్ మెంట్ ఎక్స్చేంజి ఆఫ్ తెలంగాణ ) అనే ఆన్ లైన్ పోర్టల్ ద్వారా తెలుసుకోవచ్చని అన్నారు. తదుపరి పోస్టల్ ని ఆవిష్కరించారు.జిల్లా అధికారులు తమ శాఖ అభివృద్ధి పనులపై అలాగే తమకి కేటాయించిన హాస్టల్స్ పాఠశాలలను తరువుగా క్షేత్ర స్థాయి లో పరిశీలించి తమకి నివేదిక అందచేయాలని తెలిపారు.రాష్ట్ర స్థాయి లో, జిల్లా స్థాయి లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన అర్జీలకు అధిక ప్రాధాన్యతనిస్తూ ప్రజా సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.ప్రజావాణి కార్యక్రమంలో భూ సమస్య లకి సంబంధించి 57 ధరఖాస్తులు, ఎంపిడిఓ లకి 12 ధరఖాస్తులు,మున్సిపల్ కమిషనర్లకి 7 ధరఖాస్తులు,జిల్లా పంచాయతీ అధికారికి 6 దరఖాస్తులు మిగిలిన 17 ధరఖాస్తులు వివిధ శాఖలకి చెందినవి వచ్చాయని, మొత్తం 99 దరఖాస్తులు వచ్చాయని వాటిని పరిష్కరించుట కొరకు సంబంధిత అధికారులకి పంపించటం జరిగిందని ఈ సందర్భంగా కలెక్టర్ తెలిపారు.ఈ కార్యక్రమం లో డి ఎఫ్ ఓ సతీష్ కుమార్, డి ఆర్ డి ఎ పిడి వివి అప్పారావు, జిల్లా అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ఇంటింటికి తీసుకెళ్లాలి



సందేశం టైమ్స్: నారాయణఖేడ్ నియోజకవర్గ ఇన్చార్జి 4ఆగస్టు సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ మహా సంపార్క్ అభియాన్ ద్వారా కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ఇంటింటికి తీసుకెళ్లాలని బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు రాజు రాథోడ్, పార్టీ మండల అధ్యక్షులు దశరథ్ అన్నారు.నారాయణఖేడ్ మండలంలోని సంజీవనరావుపేట గ్రామంలో సర్పంచ్ ఎంబారి విఠల్ ఏర్పాటు చేసిన ఇంటింటికి బీజేపీ కార్యక్రమంలో భాగంగా మాట్లాడుతూ... కిసాన్ సమ్మాన్ నిధి కింద దేశంలో 9.7 కోట్ల రైతన్నలకు రూ.20, 500 కోట్లను ప్రధాని మోదీ విడుదల చేశారని తెలిపారు. ఇందులో తెలంగాణాలో 30 లక్షల 80 వేల మందికి పైగా రైతుల ఖాతాల్లో నేరుగా డబ్బులు రిలీజ్ అయ్యాయనీ చెప్పారు. రాష్ట్రంలో అమలు చేసే చాలా పథకాలు కేంద్రం ప్రభుత్వం నిధులతోనే అమలు చేస్తున్నారనీ అన్నారు. ఈ విషయాలను బీజేపీ కార్యకర్తలు ప్రజలకు అర్థం అయ్యేలా వివరించి చెప్పాలని సూచించారు. గత 11 సంవత్సరాలలో మోదీ ప్రభుత్వం రైతుల సంక్షేమం, అగ్రికల్చర్, దాని అనుబంధం రంగాల కోసం ఏకంగా రూ.71 లక్షల కోట్లు ఖర్చు చేసిందని తెలిపారు. బీసీ రిజర్వేషన్ అంశంలో కాంగ్రెస్ ప్రభుత్వం రాజ్యాంగ విరుద్ధంగా మత ప్రాతిపదికన రిజర్వేషన్ తెర పైకి తెచ్చి, మన మీద బురద చల్లే కుట్ర చేస్తుందని విమర్శించారు. బీసీ బిడ్డలకు అన్యాయం చేస్తే బీజేపీ ఎప్పుడు చూస్తూ ఊరుకోదని తెలిపారు. ఈ విషయంలో ప్రజలను చైతన్యం చేయాలని చెప్పారు. ఊరులో కాచిరు దగ్గర ఈ చర్చ పెట్టాలనీ విద్యావంతులు, గ్రామ పెద్దలను ఇందులో భాగస్వామ్యం చేయాలని చెప్పారు. కేంద్రం ప్రభుత్వం మహిళలకు, రైతులకు, కార్మికులకు, ఇలా చెప్పుకుంటూ పోతే అన్ని వర్గాల సంక్షేమం, మేలు కోసం ఆలోచన చేస్తుందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలని ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు. లాస్ట్ కు ఇప్పుడు ఏం చేయాలో తెలియక జనహిత పాదయాత్ర అని కొత్త డ్రామాలు చేస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ నాయకులు జనాలను మాయ మాటలతో మోసం చేసి పాదయాత్ర చేయడం ఏమిటో అర్థం కావడం లేదన్నారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటిలను అమలు చేసి ఈ పాదయాత్రలు చేస్తే బాగుంటుందని అన్నారు. ప్రజలు కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలను నమ్మే పరిస్థితి లేదన్నారు. వచ్చే స్థానిక సంస్థ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులు పక్కాగా గెలుస్తారని ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో సర్పంచ్ ఎంబారి విఠల్, ప్రధాన కార్యదర్శులు సచిన్, కానికేందర్, కిష్టయ్య, యాదగౌడ్,విష్ణు,విఠల్,లోకేష్ తదితరులు పాల్గొన్నారు..

# నూతన బదిలీపై వచ్చిన ఎస్ఐ దోమ సుజిత్ ను సన్మానించిన

## నేషనల్ హ్యూమన్ రైట్స్ సోషల్ జస్టిస్ కమిషన్ జిల్లా ప్రెసిడెంట్




సందేశం టైమ్స్:సంగారెడ్డి జిల్లా ప్రతినిధి 4ఆగస్టు సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గంలో న్యాల్ కల్ మండల పరిధిలో హద్నూర్ ఎస్ఐ గా బదిలీపై వచ్చిన నూతనంగా పదవి బాధ్యతలు స్వీకరించిన హద్నూర్ ఎస్ఐ దోమ సుజిత్ వారికి సోమవారం నేషనల్ హ్యూమన్ రైట్స్ సోషల్ జస్టిస్ కమిషన్ జిల్లా ప్రెసిడెంట్ బైండ్ల కృష్ణ,న్యాల్ కల్ మండల ప్రెసిడెంట్ నవీన్ కుమార్ మర్యాదపూర్వకంగా కలిసిన శాలువాతో సన్మానించారు.అనంతరం జిల్లా ప్రెసిడెంట్ బైండ్ల కృష్ణ మాట్లాడుతూ....రక్షకబటులు చట్టాలు పకడ్బందీగా అమలు చేసినప్పుడే నేరాలు తగ్గుతాయని, అప్పుడే ప్రజలకు భరోసా కలుగుతుందని ధీమా వ్యక్తం చేశారు.మండలంలోని గ్రామాలలో అల్లరి ముఖాలను గుర్తించి చట్టాలు నేరస్తులకు ఏ విధంగా శిక్ష పడుతుందో వివరించినప్పుడే కొంత మేరకు నేరాలు జరగకుండా ఉ ండవచ్చునని ఆశా భావం వ్యక్తం చేశారు.ప్రతి గ్రామాలలో దాతలను గుర్తించి విరాళాలు సేకరించి నేరాలు జరగకుండా సీసీ కెమెరాల కోసం ప్రయత్నం చేయాలన్నారు. సీసీ కెమెరాల వల్ల కొంతమేరకు నేరాలు అదుపు చేయడమే కాకుండా, నేరస్తులను సులువుగా పట్టుకునే అవకాశం ఉందని గుర్తు చేశారు. ప్రజలందరూ పోలీసు వ్యవస్థతో సమన్వయంతో ఉ ంటేనే ఏ సంఘటన అయిన ముందస్తుగా సమాచారం ఇచ్చి నేరాలు అదుపు చేయడంలో ఒక భాగం ప్రజలేనన్నారు.

# నంది కంది గ్రామంలో మహా సంపర్గ్ అభియాన్ తెలంగాణలో మార్పు రాలే బతుకులు మారలే కార్యక్రమంలో





సందేశం టైమ్స్ : సంగారెడ్డి నియోజకవర్గ ఇన్చార్జి 4ఆగస్టు: సంగారెడ్డి జిల్లా సదాశివపేట మండలం అసెంబ్లీ కంది మండలం ఇన్చార్జిగా తోట చంద్రశేఖర్ నియమించడం జరిగింది కార్యక్రమంలో భాగంగా మామిడిపల్లి గ్రామానికి ఇంటింటికి బిజెపి కేంద్ర ప్రభుత్వం చేసిన తెలంగాణలో మార్పు లేదు బతుకులు మారలేదు కాంగ్రెస్ బిఆర్ఎస్ దొందు దొందే అవినీతి కంచుకోట కాంగ్రెస్ అవినీతి కంచుకోట టిఆర్ఎస్ కాంగ్రెస్ ది కుటుంబ పాలన టిఆర్ఎస్ కుటుంబ పాలన ఢిల్లీ నుండి సాగుతుంది కాంగ్రెస్ పాలన ఫామ్ హౌస్ నుంచి సాగుతుంది టిఆర్ఎస్ పాలనఅభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు గిరిధర్ బీజేవైఎం బిజెపి కార్యకర్తలు మరియు ముఖ్య అతిధులు శ్రీనివాస్ రెడ్డి రాష్ట్ర నాయకులు ఇన్చార్జి తోట చంద్రశేఖర్ పటేల్ పాల్గొనడం జరిగింది

# అక్రమంగా చేపల వేట నిర్వహిస్తే చర్యలు



మత్స్యకారులతో మాట్లాడుతున్న టాస్క్‌ఫోర్స్ అధికారులు

సందలూరు ఆగస్టు 04((సందేశం టైమ్స్): అన్నమయ్య జిల్లాలోని సోమశిల వెనుకజలాల్లో చేపల అక్రమ వేట నిర్వహిస్తే వారిపై చర్యలు తప్పవని మత్స్యశాఖ అధికారి మురళీకృష్ణ పేర్కొన్నారు. సోమశిల వెనుకజలాల్లో చేపల అక్రమ వేటపై టాస్క్‌ఫోర్స్ అధికారులు ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూలై నెల ఒకటి నుంచి మత్స్యశాఖ అధికారులు వేట చేయనివ్వకుండా నిషేధించినప్పటికీ కొందరు సాగిస్తున్నారన్నారు. దీనిపై కలెక్టర్ శ్రీధర్‌కు ఫిర్యాదులు అందడంతో స్పందించి క్షేత్రస్థాయిలో తనిఖీలు చేయాలని టాస్క్‌ఫోర్స్ కమిటీలను ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. తనిఖీల్లో భాగంగా ఈనెల 31 తేదీ వరకు చేపల వేట చేయరాదని, ఖాళీ చేసి వెళ్లిపోవాలని మత్స్యకారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ అధికారి ప్రసాద్‌నాయక్, కానిస్టేబుల్ చెన్నయ్య పాల్గొన్నారు.

# బడుల్లో అసంపూర్తిగానే నిర్మాణాలు

ఆగస్టు 04((సందేశం టైమ్స్):పాఠశాలల్లో అసంపూర్తిగా నిలిచిపోయిన పనుల పునఃప్రారంభం మరికొంత ఆలస్యమయ్యేలా ఉంది. ప్రస్తుతం పాఠశాల అభివృద్ధి కమిటీ ఖాతాల్లో ఉన్న నిధులతో ఆ పనులు చేయవద్దని విద్యా శాఖ ఆదేశించింది. గత ప్రభుత్వం నాడు-నేడు పథకం రెండో దశ పనులు 2022లో ప్రారంభించింది. జిల్లాలోని 309 పాఠశాలల్లో మౌలిక వసతులు అంటే అదనపు గదులు, ప్రహరీ గోడల నిర్మాణం, లేబొరేటరీలు, లైబ్రరీలు, మరుగుదొడ్లు, ఫ్యాన్లు, లైట్లు, గ్రీన్‌చాక్ బోర్డులు, ఎల్‌ఈడీ ఫ్యాన్ల ఏర్పాటుకు సుమారు రూ.115 కోట్లు కేటాయించేందుకు ఆమోదం తెలిపింది. అయితే రెండో దశకు మొదటి నుంచి నిధుల సమస్య వెంటాడింది. రూ.48.73 కోట్లు విడుదల చేసిన అప్పటి ప్రభుత్వం రూ.46.35 కోట్ల విలువైన మెటీరియల్ సరఫరా చేసింది. అందుబాటులో ఉన్న నిధులు, మెటీరియల్‌తోనే పాఠశాలల్లో పనులు ప్రారంభించారు. అయితే అనుకున్న లక్ష్యం



మేర పనులు పూర్తికి నిధుల సమస్య ఏర్పడింది. మొత్తం 522 అదనపు గదుల నిర్మాణం చేపట్టగా, చాలావరకూ మధ్యలో ఉండిపోయాయి. చంద్రంపాలెం ఉన్నత పాఠశాల సహా పలుచోట్ల రెండేళ్ల నుంచి ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. దీంతో తరగతి గదులు చాలని పరిస్థితి నెలకొంది. అదేవిధంగా పాఠశాలల ఆవరణల్లో ఇసుక, రాళ్లగుట్టలు ఉండడం ఇబ్బందిగా ఉంది. సెంట్రల్ ప్రొక్యూర్‌మెంట్ ద్వారా కొనుగోలు చేసిన తలుపులు, కిటికీలను అమర్చేందుకు సంబంధిత కాంట్రాక్టర్లు ఇప్పటివరకూ రాలేదు. అవి కూడా పాఠశాలల్లో ఒకచోట ఉంచారు. అయితే కొన్ని పాఠశాలల్లో పనులు పూర్తిచేయగా, సుమారు రూ.80 లక్షల వరకు కమిటీల ఖాతాల్లో ఉన్నాయి. ఈ నిధులతో కొన్ని పాఠశాలల్లో అదనపు గదుల నిర్మాణం పూర్తిచేయడానికి అధికారులు సిద్ధమయ్యారు. అయితే ఆ నిధులు ఖర్చు చేయవద్దని ఇటీవల విద్యా శాఖ ఆదేశించింది. ఇదిలావుండగా గత వారం మనబడి-మన భవిష్యత్తు పనులకు ప్రభుత్వం రూ.250 కోట్లు విడుదల చేసింది. దీంతో జిల్లాలో పెండింగ్‌లో ఉన్న పనులు పూర్తిచేయవచ్చునని అధికారులు భావించారు. జిల్లాలో 309 పాఠశాలల్లో పనులు పూర్తికావాలంటే రూ.30 కోట్లు అవసరమని విద్యా శాఖలో ఇంజనీరింగ్ విభాగం అధికారులు నివేదిక రూపొందించారు. అయితే ఆ నిధులను రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలలకు అవసరమైన పలు రకాల మెటీరియల్ సరఫరా చేసే సెంట్రల్ ప్రొక్యూర్‌మెంట్ కాంట్రాక్టర్లకు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. పాఠశాలల్లో పెండింగ్ పనులు పూర్తికి ప్రత్యేకించి నిధులు మంజూరుచేసేంత వరకూ ఆగాల్సిందేనని అధికారులు చెబుతున్నారు.

# పాఠశాలలున్నాయ్.. పిల్లల్లేరు!



ఆగస్టు 04((సందేశం టైమ్స్):పాఠశాలకు పక్కా భవనం, తరగతి గదులు, విశాలమైన మైదానం, మరుగుదొడ్లు, మధ్యాహ్న భోజన పథకం ఉండగా విద్యార్థులు మాత్రం ఇద్దరే ఉన్నారు. ఇంకొన్ని చోట్ల ముగ్గురు ఉన్నారు. ఇలా ఒకటి రెండు పాఠశాలలు కాదు. కొత్తవలస మండలంలో చాలా పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య వదిలోపే. ఆ వివరాల్లోకి వెళితే..వియ్యంపేట గ్రామంలో ఒకటి నుంచి 5 తరగతులకు సంబంధించి రెండు ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయి. ఒకప్రాథమిక పాఠశాలలో ఇద్దరే విద్యార్థులు ఉండగా వారు కూడా ఒకటి, రెండు తరగతులు చదువుతున్నారు. వీరిద్దరి కోసం ఒక ఉపాధ్యాయుడు, మరుగుదొడ్డిని శుభ్రపర్చేందుకు ఒక ఆయా, మధ్యాహ్న భోజనం వండేందుకు ఒక నిర్వాహకురాలు ఉన్నారు. ఇదే గ్రామంలో నున్న మరో పాఠశాలలో 1నుంచి 5 తరగతులకు సంబంధించి 6 గురు విద్యార్థులు ఉండగా వీరికి ఇద్దరు ఉపాధ్యాయులు ఉన్నారు. ఈ రెండు పాఠశాలలకు మధ్య దూరం చూస్తే కేవలం 200 మీటర్లే. కాగా వియ్యంపేట పంచాయతీ శివారు కొట్టానవానిపాలెం ప్రాథమిక పాఠశాలలో కూడా ఇద్దరే విద్యార్థులు ఉండగా వీరికొక ఉపాధ్యాయుడు, మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకురాలు ఉన్నారు.- కంటకాపల్లిలో ఒకే కాంపౌండ్ రెండు పాఠశాలలు నడుస్తున్నాయి. ఒక ప్రాథమిక పాఠశాలలో 1నుంచి 5 తరగతులకు సంబంధించి ఇద్దరు విద్యార్థులు ఉండగా వీరికి ఒక ఉపాధ్యాయుడు, ఆయా, మధ్యాహ్న భోజన నిర్వాహకులు ఉన్నారు. ఇక రెండో పాఠశాలలో 9 మంది విద్యార్థులు ఉండగా వీరికి ఇద్దరు ఉపాధ్యాయులున్నారు.

# ఎందుకురా ఇలా చేశావు?



ఆమదాలవలస, ఆగస్టు 04((సందేశం టైమ్స్): ఆ విద్యార్థి పాలిటెక్నిక్ డిప్లమో చదువుతున్నాడు. ఆ చదువు పూర్తయితే.. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందవచ్చు. కానీ చదువు అంటేనే ఇష్టం లేదని ఆ విద్యార్థి తల్లిదండ్రులకు చెప్పాడు. చదువుకుంటేనే భవిష్యత్ ఉంటుందని వారు నచ్చజెప్పారు. దీంతో మనస్తాపం చెంది రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులకు తీరని విషాదాన్ని మిగిల్చాడు. ఈ ఘటనకు సంబంధించి శ్రీకాకుళం రోడ్డు(ఆమదాలవలస) రైల్వే పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. విజయనగరం జిల్లా సంతకవిటి మండలం మందరాడ గ్రామానికి చెందిన దేవల హేమంత్(16) అనే విద్యార్థి చదువు ఇష్టం లేక రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆమదాలవలస రైల్వేస్టేషన్‌లో తెల్లవారుజామున 3.30 గంటల సమయంలో విజయనగరం నుంచి భువనేశ్వర్ వెళ్తున్న హీరాఖండ్ రైలు కింద పడి ప్రాణాలు కోల్పోయాడు. హేమంత్‌ను తన తండ్రి మణిభూషణరావు.. దన్నానపేట వద్ద ఉన్న ఆమదాలవలస ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో గత నెలలో డిప్లమో మొదటి సంవత్సరంలో చేర్పించారు. హేమంత్.. పాలిటెక్నిక్ కళాశాలలో చదువుకుంటూ, పట్టణంలోని బీసీ వసతిగృహంలో గత కొద్దిరోజుల నుంచి ఉంటున్నాడు. చదువుపై ఆసక్తి లేక, ఆమదాలవలసలో ఉండడం ఇష్టం లేక మూడు రోజుల కిందట స్వగ్రామమైన మందరాడకు వెళ్లిపోయాడు. తనకు చదువుపై ఆసక్తి లేదని తల్లిదండ్రులకు చెప్పాడు. కాగా.. చదువుకుంటేనే భవిష్యత్ బాగుంటుందని వారు నచ్చజెప్పి.. ఆమదాలవలసలో హాస్టల్‌కు శుక్రవారం తీసుకువచ్చారు. దీంతో హేమంత్ మనస్థాపం చెంది.. తెల్లవారుజామున రైలు కింద పడి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. తీవ్ర గాయాలపాలైన హేమంత్‌ను రైల్వేపోలీసులు 108 వాహనంలో చికిత్స నిమిత్తం శ్రీకాకుళం సర్వజన ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడని, ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని రైల్వే పోలీసులు తెలిపారు.

# వైద్యం వికటించి గర్భిణీ మృతి



బుక్కరాయసముద్రం (అనంతపురం)ఆగస్టు 04((సందేశం టైమ్స్): అనంతపురం నగరంలోని రామచంద్ర నగర్ లో శ్రీ కృప మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిలో వైద్యం వికటించి మూడు నెలల గర్భిణీ మృతి చెందింది. బుక్కరాయసముద్రం మండలం చెదల్ల గ్రామానికి చెందిన మల్లికార్జున భార్య రాధిక (32) వైద్యం కోసం శ్రీ కృప మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి వైద్యులను సంప్రదించింది. ఇప్పటికే ఆ దంపతులకు ఇద్దరు పిల్లలు ఉండడంతో వైద్యుని సంప్రదించారు. అయితే ఎలాంటి అనుమతులు లేకుండా శ్రీ కృప ఆసుపత్రి వైద్యులు డాక్టర్ బి రమణ నాయక్ అబార్షన్ చేస్తామని సిద్ధం కావాలని చెప్పడంతో ఆ దంపతులు వైద్యున్ని సంప్రదించారు. ఆపరేషన్ థియేటర్లో అబార్షన్ చేస్తున్న సమయంలో వైద్యం వికటించి రాధిక అక్కడికక్కడే మృతి చెందింది. దీంతో బంధువులు ఆసుపత్రి బయట ఆందోళనకు దిగారు. వైద్యుడి నిర్లక్ష్యం కారణంగా మహిళ మృతి చెందిందని సంబంధిత కుటుంబీకులు ఆసుపత్రి పై దాడి చేశారు. కాగా ఇప్పటికే ఆ ఆసుపత్రిలో రెండు పర్యాయాలు ఇలాంటి సంఘటనలు జరిగినా, జిల్లా వైద్యశాఖ అధికారులు అనుమతులు లేకున్నా ఆపరేషన్లు చేయడం పట్ల తీవ్రమైన విమర్శలు వ్యక్తమవుతున్నాయి. జిల్లా వైద్యశాఖ అధికారులు సైతం అనుమతులు లేకుండా ఆస్పత్రి నిర్వహించడం తెలియకపోవడంపై పలు రకాల విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఆసుపత్రికి అనుమతులు లేకుండా వైద్యులు నిర్లక్ష్యంగా వ్యవహరించిన తీరు పట్ల తీవ్రమైన ఆందోళనలు వ్యక్తం అవుతున్నాయి. మూడవ పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిస్తూ ఆగస్టు 5న ధర్నాలో పాల్గొనండి




కర్నూలు కార్పొరేషన్‌ఆగస్టు 04((సందేశం టైమ్స్): స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిస్తూ ఆగస్ట్ 5న ధర్నాలో పాల్గొనాలని సిపిఎం పిలుపునిచ్చింది. కర్నూలు నగరంలోని సుందరయ్య భవన్ లో సిపిఎం న్యూ సిటీ కమిటీ నాయకులు టి. రాముడు, సిహెచ్.సాయి బాబా, ఆర్. నరసింహులు, కె.సుధాకరప్ప, వై. నగేష్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు ప్రజలకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి ప్రజల పైన మోయలేని విధంగా విద్యుత్ చార్జీల భారాలు మోపారని విమర్శించారు. గత ప్రభుత్వ కాలంలో వ్యతిరేకించిన స్మార్ట్ మీటర్లను కూటమి ప్రభుత్వం బలవంతంగా ప్రజల ఇళ్లకు బిగిస్తున్నారని మండిపడ్డారు. ప్రజలు స్మార్ట్ మీటర్ల తిరస్కరించాలని, బలవంతంగా స్మార్ట్ మీటర్లు ఇళ్లకు బిగిస్తే పగలగొట్టాలని పిలుపునిచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిస్తూ, ప్రజలపై వేసిన విద్యుత్ చార్జీల భారాలు తగ్గించాలని, ట్రూ అప్ చార్జీలను రద్దు చేయాలని ఆగస్టు 5వ తేదీన బళ్లారి చౌరస్తా లో ఉన్న విద్యుత్ సౌధా కార్యాలయం ఎదుట, కల్లూరు ఎస్టేట్ లో ఉన్న విద్యుత్ సబ్ స్టేషన్ ఎదుట, బి క్యాంప్ సబ్ స్టేషన్ ఎదుట, ధర్నాలు జరుగుతున్నాయని ప్రజలందరూ పెద్ద సంఖ్యలో పాల్గొని మా ఇంటికి స్మార్ట్ మీటర్ వద్దు అనే హెచ్చరిక ప్రభుత్వానికి తెలియజేయాలని కోరారు.

# టైక్వాండో పోటీలలో విజ్ డమ్ విద్యార్థుల ప్రతిభ




రైల్వేకోడూరు ఆగస్టు 04((సందేశం టైమ్స్): విజయవాడలో గత నెల పదవ రాష్ట్రస్థాయి టైక్వాండో ఛాంపియన్షిప్ పోటీలలో విజ్ డమ్ సీబీఎస్ఈ పాఠశాల విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబరిచారని విజ్ డమ్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ టి ప్రదీప్, అకడమిక్ డైరెక్టర్ టి మదన్ మోహన్ తెలిపారు. పదవ తరగతి విద్యార్థి నిఖిల్ బంగారు పతకం, 9వ తరగతి విద్యార్థి సౌమ్య కాంస్య పతకం, 8వ తరగతి విద్యార్థి మోక్షిత్ బంగారు పతకం, 7వ తరగతి విద్యార్థి ఆహిల్ బంగారు పతకం, 5వ తరగతి విద్యార్థి శశాంక్, ఏడవ తరగతి విద్యార్థి దీపక్ లు బంగారు పతకాలు సాధించారని అన్నారు. పథకాలు సాధించిన విద్యార్థులను వ్యాయామ ఉపాధ్యాయులు ఉపాధ్యాయ బృందం అభినందించారు.

# వణికిస్తున్న వైరల్ జ్వరాలు

**కోటవురట్ల ఆస్పత్రి ఓపీ వద్ద జ్వర పీడితులు**
**- కోటవురట్ల మండలంలో జ్వర పీడితులు అధికం**
**- కిటకిటలాడుతున్న ఆస్పత్రులు**



కోటవురటఆగస్టు 04((సందేశం టైమ్స్): మండలంలో జ్వరాలు విజృంభిస్తున్నాయి. ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులు జ్వర పీడితులతో కిటకిటలాడుతున్నాయి. స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు రోజూ 250 నుంచి 300 మంది వస్తుండగా, వారిలో జ్వర పీడితులే ఎక్కువ మంది ఉంటున్నారు.మండలంలోని రాజుపేటతో పాటు శివారు రామన్నపాలెం, రామచంద్రపాలెం, కె.వెంకటాపురం గ్రామాల్లో ప్రతి ఇంట్లో జ్వర బాధితులు ఉంటున్నారు. చాలా మందికి డెంగ్యూ లక్షణాలు ఉండడంతో నర్సీపట్నం, విశాఖపట్నంలోని ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నట్టు ఆయా గ్రామస్థులు చెబుతున్నారు. కోటవురట్ల కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో నెల రోజుల్లో 428 మంది చికిత్స పొందారు. ఇటువంటి జ్వరాలు గతంలో ఎన్నడూ చూడలేదని వృద్ధులు చెబుతున్నారు. దీనిపై స్థానిక సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రసాద్ వివరణ కోరగా వాతావరణంలో మార్పుల కారణంగా వైరల్ జ్వరాలు వస్తున్నాయన్నారు. గ్రామాల్లో తాగునీరు కలుషితం కావడం, పారిశుధ్యం అధ్వానంగా ఉండడంతో వైరల్ జ్వరాలు వస్తున్నట్టు ఆయన చెప్పారు. వారం రోజుల నుంచి ఆస్పత్రి ఓపీ సంఖ్య రోజుకు 250 నుంచి 300 వరకు నమోదవుతోందన్నారు. ప్రజలు వేడి పదార్థాలు తీసుకోవాలని, వేడి చేసి చల్లార్చిన నీరు తాగాలని ఆయన సూచించారు.

# ఇద్దరు విద్యార్థినులకు అస్వస్థత

**బేతంచెర్ల ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులు**



బేతంచెర్ల, ఆగస్టు 04((సందేశం టైమ్స్):పట్టణ శివారు బనగానపల్లె రహదారిలో ఉన్న కేజీబీవీలో ఇద్దరు విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. కేజీబీవీలో నాలుగు రోజుల క్రితమే ఒక విద్యార్థిని మృతి చెందిన ఘటన మరువకముందే మళ్లీ సాయంత్రం అదే పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థిని విజయలక్ష్మి, 7వ తరగతి విద్యార్థిని నాగభవానీ తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వీరిని బేతంచెర్ల ప్రభుత్వాసుపత్రిలో సీపీఐ, విద్యార్థి సంఘాల నాయకులు పరామర్శించారు. ఈ విషయంపై ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి స్పందించి తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యార్థులను కర్నూలుకు తరలించినట్లు తెలిపారు. ఎంఈవో సోమశేఖర్‌ను వివరణ కోరగా.. ఈవిషయంపై వివరాలు తెలుసుకుంటానన్నారు.

# ప్రభుత్వ స్థలాల పరిరక్షణకు పోరాటం



విజయవాడ (గవర్నర్‌పేట)ఆగస్టు 04((సందేశం టైమ్స్): రాష్ట్రంలో ప్రభుత్వ స్థలాల పరిరక్షణకు ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీలు, ప్రజలు సిద్ధం కావాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ పిలుపునిచ్చారు. విలువైన ప్రభుత్వ స్థలాలను కార్పొరేట్ సంస్థలకు అన్యాక్రాంతం చేయొద్దని, ఆర్టీసీ స్థలాలను లులు కంపెనీకి లీజుకు ఇస్తూ తీసుకొచ్చిన జీవో నెంబరు 137 వెంటనే ఉపసంహరించాలని డిమాండ్ చేస్తూ సీపీఐ విజయవాడ నగర సమితి ఆధ్వర్యాన విజయవాడ దాసరి భవన్‌లో రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. సమావేశానికి సీపీఐ నగర సమితి కార్యదర్శి జి.కోటేశ్వరరావు అధ్యక్షత వహించారు. రామకృష్ణ మాట్లాడుతూ చారిత్రక నేపథ్యం కలిగి, కోట్ల రూపాయల విలువచేసే విజయవాడ పాతబస్టాండ్ స్థలంతో పాటు విశాఖపట్నంలో 14 ఎకరాల ప్రభుత్వ భూమిని కార్పొరేట్ సంస్థకు కారుచౌకగా 99 ఏళ్లు లీజుకు కట్టబెట్టడం దుర్మార్గమన్నారు. మాజీ మేయర్ జంధ్యాల శంకర్, సిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు నరహరిశెట్టి నరసింహారావు, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు దోనేపూడి కాశీనాథ్, సీపీఐ జిల్లా కార్యదర్శి దోనేపూడి కాశీనాథ్, సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ నాయకులు పి.ప్రసాద్, లిబరేషన్ నాయకుడు హరనాథ్, ఎన్‌యూసీఐ నేత సుధీర్‌బాబు, కార్మిక సంఘాల నేతలు జీవీ నరసయ్య, ఎండీ ప్రసాద్, వైఎస్ రావు, కేఆర్ ఆంజనేయులు తదితరులు ప్రసంగిస్తూ ఆర్టీసీ స్థలాన్ని లులు సంస్థకు అప్పగించాలన్న నిర్ణయాన్ని ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సుమారు రూ.300 కోట్ల విలువైన విజయవాడ గవర్నర్‌పేట డిపో, పాతబస్టాండ్‌కు చెందిన 4.15 ఎకరాలను లులు కంపెనీకి 99 ఏళ్ల పాటు కట్టబెడుతూ రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన జీవోను తక్షణమే ఉపసంహరించాలని రౌండ్‌టేబుల్ సమావేశం తీర్మానించింది. పౌరవేదిక ఆధ్వర్యంలో ఈనెల 6న జరిగే మహాధర్నాకు మద్దతు ప్రకటించింది.

# రాగివైర్ల దొంగల జోరు



ముసునూరు, ఆగస్టు 04((సందేశం టైమ్స్):మండలం లోని పలు గ్రామాల్లో వ్యవసాయ బోర్లకు సంబంధిం చిన సామగ్రిలో రాగివైర్ల చోరీలు కొనసాగుతూనే ఉన్నాయి. రాత్రి సమయాల్లో కేబుల్ వైర్, స్టార్టర్, ఫ్యూజుల్లోని రాగివైరును దుండగులు చోరీ చేస్తుం డడంతో ప్రతి రైతు రూ.10వేలు నుంచి రూ.15వేలు వరకు నష్టపోతున్నాడు. తాజాగా వేల్పుచర్లలో నలు గురు రైతుల వ్యవసాయ బోర్ల నుంచి కేబుల్, ఇతర సామగ్రిలో రాగివైర్లను దొంగిలించుకుపోయారు. వీటి విలువ సుమారు రూ.50 వేలు ఉంటుందని, ఈ చోరీలపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు బాధిత రైతు లు తెలిపారు. నెల వ్యవధిలోనే ముసునూరు, గోప వరం, రమణక్కపేట, కొర్లకుంట, పెద్దపాటివారి గూడెం, తాళ్ళవల్లి, చెక్కపల్లి తదితర గ్రామాల్లో ఒక్కొక్క గ్రామంలో 20 నుంచి 30 బోర్ల సామగ్రి చోరీ అయ్యాయి. ఇటీవల పంటపొలాల్లో బిందు సేద్యానికి సంబంధించిన సామగ్రి సైతం చోరీకి గురవుతు న్నాయి. ఒకవైపు బోర్ల సామగ్రి, మరొకవైపు డ్రిప్ పరికరాలు చోరీకి గురికావడంతో రైతులు లబోదిబో మంటున్నారు. అరకొరగా పండుతున్న పంటలతో ఇబ్బందులు పడుతుండగా, కంటిమీద కునుకు లేకుండా చేస్తున్న ఈ చోరీలతో ఆర్థికంగా నష్టపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీటిపై బాధిత రైతులు పోలీసులకు ఫిర్యాదు చేసినా దొంగలను పట్టుకున్న దాఖలాలు లేవని వాపోతున్నారు. ఇప్పటికైనా జిల్లా పోలీసు ఉన్నతాధికారులు ప్రత్యేక నిఘా పెట్టి ఈ చోరీలను నియంత్రించాలని రైతులు కోరుతున్నారు.

# తల్లీపిల్లల హత్యలతో కలకలం




ఆగస్టు 04((సందేశం టైమ్స్):సామర్లకోటఇద్దరు ఆడపిల్లలు సహా తల్లి దారుణ హత్యలతో సామర్లకోటలో తీవ్ర కలకలం రేగింది. ఆగంతకులు ముక్కుపచ్చలారని చిన్నారులను పొట్టన పెట్టుకున్నారని స్థానికులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. సామర్లకోట పట్టణం సీతారామ కాలనీలో తల్లితో సహా ఇద్దరు ముక్కు పచ్చలారని ఆడ పిల్లలు దారుణ హత్యకు గురయ్యారు. ఈ సంఘటనతో సీతారామ కాలనీలో తీవ్ర విషాద ఛాయలు నెలకొన్నాయి. స్థానికులు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని సీతారామ కాలనీలో తెల్లవారు జామున నైట్ డ్యూటీ పూర్తి చేసుకుని ఇంటికి తిరిగి వచ్చిన ధను ప్రసాద్ భార్యను ఎంత పిలిచినా బయటకు రాలేదు. దీంతో గోడదూకి చూడగా భార్య ములపర్తి మాధురి(26), కుమార్తెలు నిస్సి (8), ఫ్రైజీ (6) రక్తపుమడుగులో మరణించి ఉండటాన్ని గుర్తించారు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఇంట్లో తల్లి ఇద్దరు పిల్లల మృతదేహాలు వేరువేరు చోట్ల తలపై పదునైన గాయంతో హతమార్చినట్లు పడి ఉన్నాయి. భర్త ధనుప్రసాద్ రాత్రి విధులు ముగించుకుని ఉదయం ఏడు గంటల సమయంలో ఇంటికి రాగా హత్యకు గురైన తన భార్య పిల్లలను చూసి రోధిస్తున్న తీరు చూపర్లను కలచివేసింది. ఆగంతకులు తొలుత భార్య మాధురిని హతమార్చి, అనంతరం ఇద్దరు చిన్నారులను పాశవికంగా హతమార్చినట్టు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ సంఘటనలో ధనుప్రసాద్‌ను పోలీసులు ప్రశ్నిస్తున్నట్టు సమాచారం.దర్యాప్తు అనంతరం వివరాలు : ఎస్పిస్థానిక సీతారామ కాలనీలో మూడు హత్యలు జరిగిన సంఘటనా స్థలాన్ని ఎస్పి బిందుమాధవ్ పరిశీలించారు.

# వాతావరణ అనిశ్చితితో వానలు



విశాఖపట్నం, అమరావతిఆగస్టు 04((సందేశం టైమ్స్)::ఉత్తర తమిళనాడుకు ఆనుకుని నైరుతి బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం ఆవరించింది. ఇంకా బంగాళాఖాతం నుంచి దక్షిణ తమిళనాడు మీదుగా తూర్పు అరేబియా సముద్రం వరకు ఉపరితలద్రోణి విస్తరించింది. మరోవైపు రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో ఎండ తీవ్రత కొనసాగడంతో వాతావరణ అనిశ్చితి నెలకొంది. వీటన్నింటి ప్రభావంతో కోస్తా, రాయలసీమలో పలుచోట్ల పిడుగులు, ఉరుములతో వర్షాలు కురిశాయి. కాగా, పగటి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే మూడు నుంచి ఐదు డిగ్రీలు ఎక్కువగా నమోదయ్యాయి. ఒంగోలులో 38.5 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. రానున్న 24 గంటల్లో కోస్తా, రాయలసీమలో ఎక్కువచోట్ల వర్షాలు కురుస్తాయని, రాయలసీమలో అక్కడక్కడ భారీ వర్షాలు కురుస్తాయని, ఈ నెల ఐదో తేదీ నుంచి రాయలసీమ, దక్షిణ కోస్తాలో వర్షాలు పెరుగుతాయని వాతావరణ శాఖ తెలిపింది. ఉపరితల ఆవర్తనం ప్రభావంతో రానున్న మూడు రోజులు పల్నాడు జిల్లాతోపాటు రాయలసీమలో అక్కడక్కడ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. సోమవారం అన్నమయ్య, శ్రీసత్యసాయి, అనంతపురం, చిత్తూరు జిల్లాల్లో అక్కడక్కడ మోస్తరు నుంచి భారీ వర్షాలు, మన్యం, అల్లూరి, ఏలూరు గుంటూరు, బాపట్ల, కర్నూలు, నంద్యాల, కడప, తిరుపతి జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని ప్రకటించింది.

# జైలు నుంచి తప్పించుకుని..

# ప్రియురాలు ఇంట్లో రిమాండ్ ఖైదీ

ఆగస్టు 04((సందేశం టైమ్స్):తిరుపతి జిల్లాలో ఓ వింత సంఘటన చోటుచేసుకుంది. జైలు నుంచి పరారైన ఓ రిమాండ్ ఖైదీ ప్రియురాలికి ఇంటికి చేరుకున్నాడు. ప్రియురాలి ఇంట్లో ఉంటే ఎవ్వరూ కనుక్కోరులే అనుకున్నాడు. అయితే, అతడి పోలీసులు షాక్ ఇచ్చారు. ప్రియురాలితో ఉన్న అతడ్ని.. జైలు నుంచి పారిపోయిన 24 గంటల్లోనే పట్టుకున్నారు. సంఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల్లోకి వెళితే.. నాగలాపురానికి చెందిన శ్రీనివాసన్ అనే వ్యక్తి గత నెల 20వ తేదీన జరిగిన దొంగతనం కేసులో అరెస్ట్ అయ్యాడు. కోర్టు అతడికి రిమాండ్ విధించింది.ప్రస్తుతం సత్యవేడు సబ్ జైలులో రిమాండ్ ఖైదీ ఉంటున్నాడు. ఉదయం శ్రీనివాసన్ జైలు నుంచి తప్పించుకున్నాడు. జైలు గోడ దూకి పారిపోయాడు. నేరుగా నాగలాపురంలోని తన ప్రియురాలి ఇంటికి వెళ్లాడు. శ్రీనివాసన్ జైలులో కనిపించకపోవటంతో అధికారులు అలర్ట్ అయ్యారు. అతడి గురించి వెతకటం మొదలెట్టారు. ఈ నేపథ్యంలోనే ప్రియురాలి ఇంట్లో శ్రీనివాసన్ ఉన్నట్లు గుర్తించారు.

# శ్రీశైలం గేట్లు మూసివేత

## ఎగువ నుంచి తగ్గిన వరద ప్రవాహం



నంద్యాల,ఆగస్టు 04((సందేశం టైమ్స్):ఎగువ నుంచి శ్రీశైలం డ్యాంకు వరద ప్రవాహం తగ్గింది. దీంతో జలాశయంలోని అన్ని గేట్లను మూసేశారు. జూరాల, సుంకేసుల నుంచి 1,26,420 క్యూసెక్కుల వరద శ్రీశైలంలోకి వస్తోంది. కుడి, ఎడమ జల విద్యుత్ కేంద్రాల్లో విద్యుదుత్పత్తి ద్వారా 66,297 క్యూసెక్కుల నీటిని నాగార్జునసాగర్‌కు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా, ప్రస్తుతం 882.10 అడుగులకు చేరింది. 199.27 టీఎంసీల నీరుంది.

# భూగర్భ విద్యుత్ లైన్లపై స్పెషల్ ఫోకస్

**కొత్త సబ్‌స్టేషన్లలో 100 శాతం ఏర్పాటు దిశగా అడుగులు**

**సమ్మర్ నాటికి అందుబాటులోకి 19 సబ్‌స్టేషన్లు**

**ఇప్పటికే 7 చోట్ల పనులు ప్రారంభం**

**టెండర్ల దశలో మరో 12 భూగర్భ విద్యుత్ లైన్లు**



హైదరాబాద్ సిటీ, ఆగస్టు 04((సందేశం టైమ్స్): అండర్ గ్రౌండ్ విద్యుత్ లైన్లపై దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (టీజీఎస్పీడీసీఎల్) ప్రత్యేక దృష్టి సారిస్తోంది. గ్రేటర్‌లో అందుబాటులోకి తీసుకురానున్న 19 కొత్త సబ్‌స్టేషన్లకు వందశాతం అండర్ గ్రౌండ్ (భూగర్భ) విద్యుత్‌లైన్లతో కరెంట్ సరఫరా అందించే దిశగా పనులు చేవడుతోంది. పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా 2026 సమ్మర్ నాటికి గ్రేటర్ పరిధిలోని మెట్రో, రంగారెడ్డి, మేడ్చల్ జోన్లలో 19 కొత్త విద్యుత్ సబ్‌స్టేషన్లు నిర్మించి వాటిని చార్జ్ చేసే దిశగా ముందుకు వెళ్తోంది.ఇప్పటికే సాయినగర్, అంతాయిపల్లి, షాపూర్‌నగర్, జొన్నబండ, వీబీసిటీ, అత్తాపూర్ ఎస్టీపీ, ఫ్రైర్ ఇండియా ప్రాంతాల్లో 7 సబ్‌స్టేషన్ల పనులు ప్రారంభించారు. మరో 12 సబ్‌స్టేషన్లకు స్థలాలను గుర్తించిన దక్షిణ డిస్కం వాటికి టెండర్లు పిలిచింది. ఈ సబ్‌స్టేషన్లకు భూగర్భ విద్యుత్ లైన్లు వేస్తుండటంతో బడ్జెట్ రెండింతలు పెరుగుతోంది. అయితేరాబోవు రోజుల్లో గ్రేటర్ మొత్తంగా భూగర్భ విద్యుత్ వ్యవస్థను అందుబాటులోకి తీసుకురావాలనే ప్రభుత్వ ఆదేశాలతో దక్షిణ డిస్కం ఈ దిశగా చర్యలు చేపడుతోంది.శివారు ప్రాంతాల్లో ఓవర్ హెడ్ లైన్ల స్థానంలో ప్రత్యేకంగా రోడ్ల అడుగుభాగంలో సిమెంట్తో డక్టు నిర్మాణాలు చేపట్టి విద్యుత్ లైన్లు వేస్తే ప్రయోజనకరంగా ఉంటుందని విద్యుత్‌ంగ నిపుణులు సూచిస్తున్నారు. భవిష్యత్లో విద్యుత్ లైన్లు, ప్రైవేట్ కేబుల్స్ సాంకేతిక సమస్యలు తలెత్తినా, తీగలు కాలిపోయినా వాటిని సులభంగా మార్చేందుకు వీలుంటుందని సీనియర్ రిటైర్డ్ ఇంజనీర్లు సూచిస్తున్నారు.

# హార్స్ రేస్ బెట్టింగ్‌కు వాట్సాప్ గ్రూప్



హైదరాబాద్ సిటీ,ఆఆగస్టు 04((సందేశం టైమ్స్): వాట్సాప్ గ్రూప్‌ను ఏర్పాటు చేసి ఆన్‌లైన్‌లో హార్స్ రేసింగ్‌పై బెట్టింగ్‌లను ఆహ్వానిస్తున్న ఓ బుకీతోపాటు ముగ్గురు పంటర్లను మల్కాజిగిరి ఎస్ఓటీ, జవహర్‌నగర్ పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.2లక్షల నగదు, మొబైల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. గుంటూరుకు చెందిన నగేష్(45)చెన్నైలో కొంతకాలం పనిచేశాడు. హార్స్ బెట్టింగ్‌లకు అలవాటు పడిన ఇతను ఉద్యోగం పోవడం, కుటుంబ కారణాలతో నగరానికి వచ్చాడు. మలక్‌పేటకు చెందిన రాజేష్ కుమార్, విజయవాడకు చెందిన వెంకట్ చౌదరిలతో కలిసి హార్స్ రేస్ బెట్టింగ్‌లు నిర్వహించేవాడు.తర్వాత కాలంలో పంటర్లను ఆకర్షించి, సొంతంగా బెట్టింగ్ నిర్వహించాడు. అంతేకాక 'షైన్‌వెల్ ఎంటర్‌ప్రైజెస్' పేరుతో వాట్సాప్ గ్రూప్ రూపొందించి, అందులో బెట్టింగ్‌లు స్వీకరించేవాడు. ఈ గ్రూపులో దేశ వ్యాప్తంగా 105 మంది పంటర్లు సభ్యులుగా ఉండగా, అందులో నగరానికి చెందిన వారు 20 మంది వరకు ఉన్నారు. వాట్సాప్ ద్వారా బెట్టింగ్‌లు తీసుకొని, ఆన్‌లైన్‌లో లావాదేవీలు నిర్వహించేవాడు. ఈ దందాపై పక్కా సమాచారమందుకున్న మల్కాజిగిరి ఎస్ఓటీ, జవహర్‌నగర్ పోలీసులు కలిసి దాడి చేశారు. బుకీ నాగేష్‌తోపాటు, పంటర్లు మణికొండకు చెందిన బొర్రా వెంకట్ చౌదరి, కృష్ణానగర్‌కు చెందిన చల్లా రమేషబాబు, సఫిల్‌గూడకు చెందిన సునీల్‌ను అరెస్ట్ చేశారు. నగేష్ బ్యాంకు ఖాతా నుంచి రూ.8.34 లక్షల మేర లావాదేవీలు జరిగినట్లు గుర్తించారు. బ్యాంకు ఖాతాలో ఉన్న 2.47 లక్షలను సీజ్ చేశారు. తదుపరి విచారణ కోసం నిందితులతోపాటు స్వాధీనం చేసుకున్న సొత్తును జవహర్‌నగర్ పోలీసులకు అప్పగించారు.

# ఒడిశా బాలిక కిడ్నాప్ కథ సుఖాంతం

నిజాంపేట్, ఆగస్టు 04((సందేశం టైమ్స్): ఒడిశాలో కిడ్నాప్‌కు గురై.. బాచుపల్లి ప్రాంతంలో బంధించి ఉన్న బాలికను మొబైల్ సిగ్నల్స్ ఆధారంగా చెర నుంచి విడిపించారు. బాచుపల్లి సీఐ సతీష్ కుమార్ తెలిపిన వివరాలు ప్రకారం... ఒడిశా రాష్ట్రం కేంద్రపడ జిల్లా సాహిర గ్రామానికి చెందిన బాలికను గుర్తుతెలియని వ్యక్తులు కిడ్నాప్ చేసి బాచుపల్లి ప్రాంతంలోని ఇందిరానగర్ కాలనీలో ఉన్న ఒక ఇంట్లో నిర్బంధించారు. ఈ విషయమై రాత్రి ఒడిశా కటక్ ప్రాంతంలో ఉన్న సౌత్ ఏసియా ఉమెన్ ఫౌండేషన్ ప్రోగ్రామ్ అధికారి తన్విసింగ్ .. బాచుపల్లి పోలీసులకు సమాచారం ఇచ్చారు.వారు కేసును సవాల్‌గా తీసుకున్నారు. అయితే బాలిక తన వద్ద ఉన్న మొబైల్ ద్వారా ఫొటో పంపి, లొకేషన్ వివరాలు తల్లిదండ్రులకు తెలిపింది. ఆ తర్వాత ఫోన్ స్విచ్ఛాఫ్ వచ్చిందనే వివరాలు దర్యాప్తులో వెలుగుచూశాయి. ఈ మేరకు రంగంలోకి దిగిన పోలీసులు మొబైల్ సిగ్నల్స్ ఆధారంగా ఒక ఇంట్లో బంధించి ఉన్న బాలికను రక్షించారు. అనంతరం నూరారంలోని సఖీ సెంటర్‌కు తరలించారు. అనంతరం బాలిక తల్లిదండ్రులకు, ఒడిశా పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఇక్కడికి చేరుకున్న కుటుంబీకులకు మైనర్‌ను అప్పగించారు. కిడ్నాప్ ఎవరు చేశారు? ఎందుకు చేశారు అనే కోణాల్లో కేసును దర్యాప్తు చేస్తున్నారు.

# 26 తులాలు.. కాదు 5 తులాలే..!

**బాధితులు, నిందితుల వేర్వేరు ప్రకటనలు**

**పోలీసులకు సవాల్‌గా మారిన చోరీ సొత్తు రికవరీ**



అల్వాల్,ఆగస్టు 04((సందేశం టైమ్స్):చోరీ జరగడం ఒకటైతే.. పోయిన సొత్తు విషయంలో క్లారిటీ లేక పోలీసులు తలలు పట్టుకుంటున్నారు. చోరీ అయిన బంగారం 26 తులాలు అని బాధితులు పేర్కొంటుండగా, కాదు కాదు తాము తస్కరించింది కేవలం 5 తులాలే అంటూ నిందితులు పేర్కొంటుండడం ఇందుకు కారణమైంది. వివరాలిలా ఉన్నాయి. అల్వాల్ పరిధిలోని అంజనాపురికాలనీలో ఉంటున్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగి సుశాంత్, భార్య పల్లవితో కలిసి ఉంటున్నారు. జూలై 23న దంపతులిద్దరూ ఆంధ్రప్రదేశ్‌లోని మదనపల్లికి వెళ్లారు. 28వ తేదీన రాత్రి 10 గంటలకు తిరిగి వచ్చారు. కాగా, ఈ మధ్యలో ఇంట్లో చోరీ జరిగినట్లు గుర్తించారు.26తులాల బంగారు, 20 గ్రాముల వెండి ఆభరణాలు, రూ.20వేల నగదు చోరీ అయినట్లు బాధితుడు సుశాంత్ అల్వాల్ పోలీసులకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశాడు. దర్యాప్తు చేసిన పోలీసులు ముగ్గురు పాత నేరస్తులతోపాటు చోరీ బంగారం కొన్న సంగారెడ్డికి చెందిన రిసీవర్‌ను కూడా అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. విచారణలో 5 తులాల బంగారు ఆభరణాలను మాత్రమే చోరీ చేసినట్లు నిందితులు చెబుతుండటంతో సొత్తు రికవరీ పోలీసులకు సవాల్‌గా మారింది. పోలీసుల సమాచారంతో పోలీస్ స్టేషన్‌కు వచ్చిన సుశాంత్ దంపతులు తమది తప్పుడు ఫిర్యాదు కాదని మీడియాకు వెల్లడించారు. చోరీకి గురైన 26 తులాల బంగారు, ఇతర ఆభరణాలను ఇప్పించాలని వారు వేడుకుంటున్నారు. అయితే, పోలీసులు ఈ కేసును రెండు కోణాల్లోనూ దర్యాప్తు చేస్తున్నట్లు తెలిసింది. ఈ విషయంపై స్పందించడానికి నిరాకరించిన పోలీసులు త్వరలోనే కేసు వివరాలు మీడియాకు వివరిస్తామని తెలిపారు.

# మహిళలు, పిల్లల రక్షణపై స్పెషల్ ఫోకస్

**షీ టీమ్స్ ఆధ్వర్యంలో 96 డెకాయి ఆపరేషన్స్**

**పాఠశాలల్లో సురక్షా కవచ్ కార్యక్రమం**

**వివరాలు వెల్లడించిన డీసీపీ సృజన**




హైదరాబాద్ సిటఆగస్టు 04((సందేశం టైమ్స్):మహిళలు, పిల్లల రక్షణ కోసం సైబరాబాద్ షీ టీమ్స్ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టామని డీసీపీ సృజన కరణం పేర్కొన్నారు. శాంతిభద్రతల పరిరక్షణతో పాటు ఇంటా,బయట పిల్లలు, మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై సైబరాబాద్ ఉమెన్ అండ్ చిల్డ్రన్ సేఫ్టీ వింగ్ ప్రత్యేకంగా పనిచేస్తోందన్నారు. గత నెల 28 నుంచి ఆగస్టు 2 వరకు షీ టీమ్స్ 96 డెకాయ్ ఆపరేషన్స్ నిర్వహించి 47 మందిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో మహిళలు, యువతుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నట్లు 22 ఫిర్యాదులు వచ్చాయని, ఫ్యామిలీ కౌన్సెలింగ్ సెంటర్‌లో 24 కుటుంబాలకు కౌన్సిలింగ్ నిర్వహించి భార్యాభర్తల గొడవలకు పరిష్కారం చూపామన్నారు.సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో చిల్డ్రన్ అండ్ యూత్ సేఫ్టీ ఫోరం ఆధ్వర్యంలో సురక్షా కవచ్ కార్యక్రమం నిర్వహించామని డీసీపీ తెలిపారు. పాఠశాల విద్యార్థుల భద్రత నేపథ్యంలో సైబరాబాద్ పరిధిలో తొలిసారి ఈ కారక్రమాన్ని చేపట్టి పలు అంశాలపై అవగాహన కల్పించామన్నారు. ముఖ్యంగా శారీరక భద్రత, సైబర్ భద్రత, మానసిక ఒత్తిడి, రోడ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సేఫ్టీ అంశాలపై నిపుణులు విద్యార్థులకు సూచనలు చేసినట్లు తెలిపారు. స్కూల్ బస్సు డ్రైవర్లకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించినట్లు ఆమె పేర్కొన్నారు.

# డ్రగ్స్ కేసుల్లో పబ్బులకు లింకులు

**ఇటీవల మూడు బడా కేసులు వెలుగులోకి..**

**కొద్దిరోజులుగా వారాంతపు నిఘాపై**

**అధికారుల నిర్లక్ష్యం**




హైదరాబాద్ సిటీ, ఆగస్టు 04((సందేశం టైమ్స్): ఈగల్ టీమ్ ఇటీవల నిర్వహించిన డెకాయ్ ఆపరేషన్‌లో విస్తుపోయే విషయాలు వెలుగుచూశాయి. అలాగే హైదరాబాద్ నార్కోటిక్ ఎన్‌ఫోర్స్‌మెంట్ (హెచ్ న్యూ) పోలీసులకు పట్టుబడిన డ్రగ్స్ ముఠా అరెస్టు కేసులో పబ్బులతో ఉన్న లింకులు బయటపడ్డాయి. డ్రగ్స్ స్మగ్లర్లు మాదకద్రవ్యాలను నిర్వాహకులకు సరఫరా చేసినట్లు తేటతెల్లమైంది. పబ్ కల్చర్‌కు అలవాటైన యువతను వలపు వలతో మత్తుకు బానిసలు చేస్తున్నారు. సంపన్నుల పిల్లలు, వైద్యులు, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు బాధితులుగా ఉన్నారంటే నెట్‌వర్క్ ఎలా ఉందో అర్థమవుతోంది.ఇటీవల గచ్చిబౌలిలో ఈగల్ (నార్కోక్ బ్యూరో) టీమ్ డెకాయ్ ఆపరేషన్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌లు, సంపన్నుల పిల్లలు, వైద్యులు ఉన్నారు. వారంతాల్లో పబ్‌లకు వెళ్లేవారే ఎక్కువగా ఉంటున్నట్లు గుర్తించారు.కొంపల్లిలోనూ మల్నాడు రెస్టారెంట్ డ్రగ్స్ కేసులో సూర్యనెట్ వర్క్‌లో పబ్ నిర్వాహకులు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. సిటీ, సైబరాబాద్ పరిధిలోని 10 పబ్‌లతో నిందితులకు డ్రగ్స్ లింకులు ఉన్నట్లు పబ్‌ల పేర్లతో సహా.. ఈగల్ సిబ్బంది ప్రకటించింది.ఇటీవల ముంబయి డ్రగ్స్ స్మగ్లర్స్ ముఠాను హైదరాబాద్ నార్కోటిక్ ఎన్‌ఫోర్స్‌మెంట్ (హెచ్ న్యూ) పోలీసులు పట్టుకోగా డ్రగ్స్ వినియోగదారులు రవికుమార్ వర్మ, సచిన్‌లను విచారించిన అనంతరం ఈ ముఠాను పట్టుకున్నారు. డార్జిలింగ్‌కు చెందిన లేడీ డ్రగ్స్ స్మగ్లర్ చోడెన్ షేర్పా కతంగ్ డ్రగ్స్‌ను సరఫరా చేసినట్లు తేలింది. చోడెన్.. నగరంలోనే ఉంటూ తరచూ పబ్‌లకు వెళ్లి యువతపై వలపు వల వేసి పరిచయం పెంచుకొని ఆతర్వాత డ్రగ్స్ అలవాటు చేస్తున్నట్లు విచారణలో తేలింది.

# ఉప్పల్‌లోని ఓ ఇంట్లో డ్రగ్స్



హైదరాబాద్ ఆగస్టు 04((సందేశం టైమ్స్): ఉప్పల్‌లోని ఓ ఇంటిపై దాడి చేసిన ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులు ఎండీఎంఏ డ్రగ్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఢిల్లీ నుంచి హైదరాబాద్‌కు డ్రగ్‌ను రవాణా చేసి నగరంలో విక్రయిస్తున్న ఇద్దరు అంతర్రాష్ట్ర స్మగ్లర్స్‌ను అరెస్ట్ చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. ఢిల్లీకి చెందిన సందీప్, భరత్, రిషబ్‌శెట్టిలు స్నేహితులు. వీరు ముఠాగా ఏర్పడ్డారు. సందీప్ ఢిల్లీ నుంచి ఎండీఎంఏ డ్రగ్‌ను గుట్టుగా హైదరాబాద్‌కు రవాణా చేసేవాడు.ఉప్పల్‌లో ఉంటున్న భరత్, రిషబ్‌షెట్టిలు నగరంలోని కస్టమర్స్‌కు రహస్యంగా విక్రయించి సొమ్ము చేసుకునేవారు. విశ్వసనీయ సమాచారం మేరకు ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ సుభాష్ చంద్ర, సిబ్బంది అఖిల్, వెంకటేశ్వర్లు సహా.. తన టీమ్‌తో కలిసి ఉప్పల్ పరిధిలో ఓ ఇంటిపై దాడి చేశారు. అక్కడ ఎండీఎంఏ డ్రగ్, గంజాయి కలిగి ఉన్న భరత్, రిషబ్‌షెట్టిలను అరెస్టు చేశారు. వారి నుంచి 13.65 గ్రాముల ఎండీఎంఏ డ్రగ్, 513 గ్రాముల గంజాయి స్వాధీనం చేసున్నారు. నిందితులతో పాటు.. స్వాధీనం చేసుకున్న మాదక ద్రవ్యాలను ఉప్పల్ ఎక్సైజ్ పోలీసులకు అప్పగించారు.

# సంపాదకీయం

## ఫిరాయింపు చిక్కులు

సుప్రీంకోర్టు తీర్పుతో పార్టీ ఫిరాయింపులకు అడ్డుకట్ట పడుతుందా? పార్టీ ఫిరాయింపు ఆరోపణలు ఎదుర్కొంటున్న పది మంది తెలంగాణ ఎమ్మెల్యేల విషయంలో మూడు నెలల్లో నిర్ణయం తీసుకోవాలన్న సుప్రీం తీర్పును శాసనసభ స్పీకర్ ఔదాల్చుతారా? చట్ట సభల స్పీకర్లు ఇకపై సుప్రీంకోర్టు పరిధిలోకి వెళతారా? ఈ ప్రశ్నలకు సమాధానాలు లభించాలంటే ఏం చేయాలి? జ్యుడీషియరీ, లెజిస్లేచర్ వ్యవస్థలలో ఎవరిది పై చేయి? చట్ట సభల స్పీకర్ల వ్యవహారాలపై తరచూ వివాదాలు ఎందుకు వస్తున్నాయి? ఈ ప్రశ్నలకు సుప్రీంకోర్టు తాజా తీర్పు సమాధానం చెప్పిందా? అంటే అవుననిగానీ, కాదనిగానీ చెప్పలేని పరిస్థితి! పార్టీ ఫిరాయింపు చట్టం లోపభూయిష్టంగా ఉండటంతోపాటు నిర్ణయాలు తీసుకోవడంలో చట్టసభల స్పీకర్లకు నిర్దిష్ట కాలవ్యవధి లేకపోవడమే వివాదాలకు కారణం అవుతోంది. ఒకప్పుడు చట్ట సభల స్పీకర్లు పార్టీలకు అతీతంగా, న్యాయబద్ధంగా నిర్ణయాలు తీసుకొనేవారు. కాలక్రమంలో స్పీకర్లు చట్టసభల్లో తాము ప్రాతినిధ్యం వహిస్తున్న పార్టీల ప్రయోజనాలకు అధిక ప్రాధాన్యం ఇవ్వడం మొదలుపెట్టారు. దీంతో వివాదాలు న్యాయస్థానాలకు చేరుతున్నాయి. అయితే స్పీకర్ల అధికారాల్లో జోక్యం చేసుకొనే విషయంలో సర్వోన్నత న్యాయస్థానానికి సైతం పరిమితులు ఉన్నందున వివాదాలు వివాదాలుగానే మిగిలిపోతున్నాయి. ఈ నేపథ్యంలోనే భారత రాష్ట్ర సమితికి చెందిన ఎమ్మెల్యేల ఫిరాయింపు వ్యవహారం సుప్రీంకోర్టుకు చేరింది. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై సుప్రీంకోర్టు అనర్హత వేటు వేస్తుందని బీఆర్ఎస్ ఆశించింది. అప్పటికే పార్టీ ఫిరాయించిన వారిపై సుప్రీంకోర్టు చర్యలు తీసుకుంటుందని బలంగా చెప్పడం ద్వారా మరికొందరు పార్టీ ఫిరాయించకుండా బీఆర్ఎస్ అడ్డుకోగలిగింది. అయితే సుప్రీంకోర్టు తీర్పు ఆ పార్టీకి ఆశాభంగం కలిగించిందని చెప్పవచ్చు. 'ఆపరేషన్ సక్సెస్%–%పేషెంట్ డెడ్' అన్నట్టుగా తమ తీర్పు ఉండకూడదని భావించిన సుప్రీంకోర్టు... ఫిరాయింపుల విషయంలో నిర్ణయం తీసుకోవడానికి స్పీకర్‌కు మూడు నెలల గడువు విధించింది. ఈ గడువుకు లోబడి స్పీకర్ నిర్ణయం తీసుకోని పక్షంలో పరిస్థితి మళ్లీ మొదటికి వస్తుంది. ఇలాంటి పరిస్థితులు తలెత్తకుండా ఉండాలన్నా, చట్టసభలు%–%న్యాయ వ్యవస్థ మధ్య ఘర్షణ తలెత్తరాదన్నా నిర్ణయాలు తీసుకోవడంలో స్పీకర్‌కు పార్లమెంటు గడువు విధించాలని సుప్రీంకోర్టు తన తాజా తీర్పులో పేర్కొంది. స్పీకర్ వద్ద వివాదాలు ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉంటున్నాయి. ఫలితంగా ఫిరాయింపుల నిరోధక చట్టం అపహాస్యం పాలవుతోంది. ఆ చట్టాన్ని మరింత పకడ్బందీగా సవరించడంతోపాటు స్పీకర్లకు కాలవ్యవధి నిర్ణయిస్తూ పార్లమెంటు చర్యలు తీసుకున్నప్పుడే ఈ సమస్యలకు పరిష్కారం లభిస్తుంది. అప్పటివరకు జ్యుడీషియరీ, లెజిస్లేచర్‌లలో ఎవరిది పైచేయి అన్న అకడమిక్ చర్చలు సాగుతూనే ఉంటాయి.అధికార పార్టీ ప్రయోజనాలు కాపాడటానికే ఆయా చట్టసభల స్పీకర్లు అధిక ప్రాధాన్యం ఇస్తున్నందున సకాలంలో నిర్ణయాలు వెలువడటం లేదు. పార్టీ ఫిరాయింపుల విషయమే తీసుకుందాం. అధికారంలో ఉన్నప్పుడు ఫిరాయింపులను ప్రోత్సహించని పార్టీ లేదంటే అతిశయోక్తి కాదు. ప్రతిపక్షంలోకి వెళ్లాక అవే పార్టీలు అన్యాయం అంటూ ఆక్రోశిస్తుంటాయి. తెలుగు రాష్ట్రాలే ఇందుకు నిదర్శనం. ప్రత్యేక తెలంగాణ ఉద్యమ సమయంలో తెలంగాణ రాష్ట్ర సమితికి చెందిన కొంత మంది ఎమ్మెల్యేలను నాటి ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్న వైఎస్ రాజశేఖరరెడ్డి కాంగ్రెస్‌లో చేర్చుకున్నారు. ఇలా చేయడం అనైతికం, అక్రమం అని టీఆర్ఎస్ అధినేతగా ఉన్న కేసీఆర్ ఆక్రోశించారు. ఒక పార్టీ తరఫున గెలిచిన వారిని మరో పార్టీలో ఎలా చేర్చుకుంటారని ప్రశ్నించారు? సీన్ కట్ చేస్తే... తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడింది. కేసీఆర్ ముఖ్యమంత్రి అయ్యారు. తాను ఒకప్పుడు తప్పుపట్టిన పనినే ఆయన అధికారంలోకి వచ్చాక దర్జాగా చేశారు. కాంగ్రెస్‌తెలుగుదేశం కమ్యూనిస్టు పార్టీలకు చెందిన సభ్యులను తమ పార్టీలో కలుపుకొన్నారు. అప్పట్లో శాసనసభలో కేసీఆర్‌కు బొటాబొటి మెజారిటీ మాత్రమే ఉన్నందున ఈ చర్యను ప్రజలు కూడా పెద్దగా ఆక్షేపించలేదు. ఆయన రెండోసారి ముఖ్యమంత్రి అయినప్పుడు సభలో సొంతంగా కావల్సినంత మెజారిటీ ఉండింది. అయినా కాంగ్రెస్, తెలుగుదేశం సభ్యులను చేర్చుకున్నారు. కాంగ్రెస్ పార్టీకి ప్రతిపక్ష హోదా కూడా లభించకుండా చేశారు. ఇందులోని నైతికతను పక్కనపెడితే కేసీఆర్ చర్యను ప్రజలు కూడా ఆక్షేపించారు. ప్రభుత్వ మనుగడకు ముప్పు లేకపోయినా పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించడం ఏమిటన్న ప్రశ్న ఉత్పన్నమైంది. అప్పట్లో తన చర్యను సమర్థించుకునేందుకు... బంగారు తెలంగాణ సాధనకోసం వారంతా తనతో చేతులు కలిపారని కేసీఆర్ చెప్పుకొన్నారు. 2023లో భారత రాష్ట్ర సమితి అధికారం కోల్పోయింది. గతంలో కేసీఆర్ చేసిన విధంగానే తన ప్రభుత్వ సుస్థిరతకోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కూడా ఫిరాయింపులను ప్రోత్సహించారు. బీఆర్ఎస్ తరఫున గెలిచిన పది మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌తో జట్టుకట్టారు. దీంతో బాధితుడిగా మిగిలిన కేసీఆర్, తమ పార్టీ తరఫున గెలిచి కాంగ్రెస్‌లోకి ఫిరాయించిన వారిపై అనర్హత వేటు వేయాలని స్పీకర్‌కు ఫిర్యాదు చేయించారు. స్పీకర్ ఎంతకీ నిర్ణయం తీసుకోకపోవడంతో ముందు హైకోర్టును, ఆ తర్వాత సుప్రీంకోర్టును ఆశ్రయించారు. కేసీఆర్ అధికారంలో ఉన్నప్పుడు పార్టీ ఫిరాయింపులపై అప్పటి స్పీకర్లు కూడా నిర్ణయాలను పెండింగ్‌లోనే ఉంచారుఫిరాయింపుల విషయంలోనే కాదు, సభ్యుల రాజీనామాల విషయంలో కూడా స్పీకర్లు నిర్ణయాలు తీసుకోకుండా పెండింగ్‌లో పెడుతున్నారు.

# బీఈఎస్ఎస్‌కు ఈఆర్‌సీ గ్రీన్ సిగ్నల్

అమరావతి, ఆఆగస్టు 04((సందేశం టైమ్స్)::రాష్ట్రంలో బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్ (బీఈఎస్ఎస్)ను అమలు చేసేందుకు విద్యుత్తు నియంత్రణ మండలి (ఏపీఈఆర్‌సీ) ఆమోదం తెలిపింది. రాష్ట్రంలో పవర్ సిస్టమ్ డెవల్‌పమెంట్ ఫండ్ (పీఎస్‌డీఎఫ్) కింద నిధులు వ్యయం చేసేందుకు కూడా ఈఆర్‌సీ అనుమతి ఇచ్చింది. ఈ మేరకు ఏపీఈఆర్‌సీ ఉత్తర్వు జారీ చేసింది. సౌర విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల్లో పగటి పూట ఉత్పత్తి అయిన విద్యుత్తును



రాత్రి సమయంలోనూ వినియోగించుకునేందుకు వీలుగా బ్యాటరీ స్టోరేజీ విధానాన్ని వాడుకోవాలని కేంద్ర ఇంధన శాఖ రాష్ట్రాలకు సూచించింది. ఈ వెసులుబాటును సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర ఇంధన శాఖ నిర్ణయించింది. ప్రధానంగా గిరిజన తండాల్లో సౌర విద్యుత్తును బ్యాటరీలో నిక్షిప్తం చేసి రాత్రి సమయంలో వాడుకునే పథకాన్ని అమలు చేయాలని రాష్ట్ర విద్యుత్తు పంపిణీ సంస్థలు ఇప్పటికే కార్యాచరణను రూపొందించాయి. ఈ కార్యచరణపై రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వు జారీ చేసింది. ఈ ఉత్తర్వును పరిశీలించిన ఈఆర్‌సీ... వయబిలిటీ గ్యాఫ్ ఫండింగ్ (వీజీఎఫ్) కింద బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్‌కు నిధులు వ్యయం చేసుకోవచ్చంటూ ఏపీ ట్రాన్స్‌కోకు అనుమతి ఇచ్చింది.

# కర్నూలు మెడికల్ కళాశాలలో ర్యాగింగ్ కలకలం

## సీనియర్ విద్యార్థులకు పోలీసుల కౌన్సెలింగ్

కర్నూలు హాస్పిటల్,ఆగస్టు 04((సందేశం టైమ్స్)::కర్నూలు మెడికల్ కళాశాలలో ర్యాగింగ్ అంశం కలకలం రేపింది. తమను మూడో సంవత్సరం ఎంబీబీఎస్ విద్యార్థులు ర్యాగింగ్ చేస్తున్నారని, వినాయక చందాలు ఇవ్వాలని ఒత్తిడి చేస్తున్నారని మొదటి సంవత్సరం విద్యార్థులు నేషన్ మెడికల్ కమిషన్, కళాశాల ప్రిన్సిపాల్, జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై పోలీసులు వెంటనే స్పందించారు. శుక్రవారం సాయంత్రం డీఎస్పీ బాబుప్రసాద్ ఆధ్వర్యంలో కాలేజీ మెన్స్ హాస్టల్‌లో సీనియర్ విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. అలాగే, ర్యాగింగ్ ఆరోపణలపై వైస్ ప్రిన్సిపాల్ సాయిసుధీర్ ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ కె.చిట్టినరసమ్మ విచారణ కమిటీని నియమించారు. ఈ కమిటీ విచారణ చేపట్టి సీనియర్ విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇచ్చింది. జూనియర్లను ర్యాగింగ్ పేరిట వేధించి, భవిష్యత్తును ఇబ్బందుల్లోకి నెట్టుకోవద్దని హెచ్చరించింది. కాగా, కాలేజీలో



ఎటువంటి ర్యాగింగ్ జరగలేదని, విచారణలో ర్యాగింగ్ జరిగినట్లు విద్యార్థులెవ్వరూ చెప్పలేదని తెలిపారు. చందాలు అడిగిన విషయమై స్పందిస్తూ, ఇది.. హాస్టల్‌లో ఎన్నో ఏళ్లుగా విద్యార్థులు స్వచ్ఛందంగా జరుపుకునే ఉత్సవాలకు సంబంధించిన అంశమని, ర్యాగింగ్ కిందకు రాదని చెప్పారు.



# 18న డిగ్రీ అడ్మిషన్లకు నోటిఫికేషన్

## 27న సీట్ల కేటాయింపు, 28 నుంచి తరగతులు

%అమరావతి, ఆగస్టు 04((సందేశం టైమ్స్):డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలకు ఉన్నత విద్యామండలి తాత్కాలిక షెడ్యూలు రూపొందించింది. ఈ నెల 18న నోటిఫికేషన్ జారీచేయాలని భావిస్తోంది. ఈలోగా ఈనెల 4 వరకు కాలేజీలు కోర్సులను సింగిల్ మేజర్‌లోకి మార్చుకునేందుకు గడువు పొడిగించింది. 7న సింగిల్ మేజర్‌పై నిబంధనలు జారీ చేయనుంది. 9 నుంచి 16 వరకు కాలేజీలకు యూనివర్సిటీలు అఫిలియేషన్లు మంజూరుచేస్తాయి. 18 నంచి 20వరకు విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. 21 నుంచి 24 వరకు వెబ్ ఆప్షన్ల ఎంపికకు గడువు ఇస్తారు. 27న సీట్లు కేటాయించి, 28 నుంచే తరగతుల ప్రారంభించేందుకు అనుమతిస్తారు. కాగా, ఈ ఏడాది నుంచి ఆన్‌లైన్‌తో పాటు ఆఫ్‌లైన్‌లోనూ దరఖాస్తులు స్వీకరించాలని నిర్ణయించారు. విద్యార్థులు నేరుగా కాలేజీలకు వెళ్లి దరఖాస్తు సమర్పిస్తారు. అయితే దానిని కూడా ఆన్‌లైన్ చేస్తారు. ఒకవేళ విద్యార్థి ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ రెండిటిలోనూ దరఖాస్తు చేసుకుంటే ఆఫ్‌లైన్ దరఖాస్తుకు తొలి ప్రాధాన్యత ఇస్తారు. ఆఫ్‌లైన్‌లో కోరుకున్న కాలేజీలో సీటు రాకపోతే ఆన్‌లైన్ ఎంపికలు తర్వాతి ప్రాధాన్యతలో ఉంటాయి.

# బేకరీల్లోనూ అదే సీన్



- ♦ విచ్చలవిడిగా రంగులు, రసాయనాలు వినియోగం
- ♦ రోజుల తరబడి నిల్వ ఉంచి విక్రయం
- ♦ స్వీట్స్, కేక్స్ దుకాణాల్లో కూడా...
- ♦ ఆహార భద్రత, ప్రమాణాల శాఖ అధికారుల తనిఖీల్లో బహిర్గతం
- ♦ నగరంలోని 40 షాపుల్లో సోదాలు
- ♦ గడువు తీరిన వస్తువులతో అపరిశుభ్ర వాతావరణంలో ఉత్పత్తుల తయారు చేస్తున్నట్టు గుర్తింపు

ఆగస్టు 04((సందేశం టైమ్స్):స్వీట్లు, కేకులు బాగా తింటున్నారా?, తరచూ బేకరీ ఐటమ్స్ కొనుగోలు చేస్తున్నారా?...అయితే మీరు ఆరోగ్యం గురించి ఒక ఆలోచించుకోవాల్సిందే. ఎందుకంటే నగర పరిధిలో స్వీట్లు, బేకరీల్లో విక్రయించే ఉత్పత్తుల్లో ఆరోగ్యానికి హాని కలిగించే రసాయనాలు, రంగులను అధిక మోతాదులో వినియోగిస్తున్నట్టు ఆహార భద్రత, ప్రమాణాల శాఖ అధికారులు నిర్వహించిన దాడుల్లో బయటపడింది. తూనికలు, కొలతల శాఖ అధికారులతో కలిసి 20 బృందాలుగా ఏర్పడి ఈ తనిఖీలు నిర్వహించారు. దాదాపు 90 శాతం దుకాణాల్లో అత్యంత దారుణమైన వాతావరణంలో ఉత్పత్తులను తయారు చేస్తున్నట్టు గుర్తించారు. కొంతమంది రోజుల తరబడి నిల్వ ఉంచిన స్వీట్లు, కేకులు, ఇతర బేకరీ పదార్థాలను నిల్వ ఉంచి విక్రయిస్తున్నట్టు గుర్తించారు.హోటళ్లు, రెస్టారెంట్లలో తనిఖీలు చేపట్టిన అధికారులు శనివారం స్వీట్స్ దుకాణాలు, బేకరీల్లో సోదాలు చేశారు. స్వీట్లు, కేకులతోపాటు కొన్నిరకాల బేకరీ ఉత్పత్తుల తయారీలో ఆరోగ్యానికి హాని కలిగించే రసాయనాలను అధిక మోతాదులో వినియోగిస్తున్నట్టు ఈ సందర్భంగా అధికారులు గుర్తించారు. అలాగే గడువు తీరిన రంగులను ఉపయోగిస్తున్నట్టు తేల్చారు. ముఖ్యంగా రామ్‌నగర్‌లోని బేకరీ డెన్, తగరపువలసలోని దేవీ స్వీట్స్, మద్రిపాలెంలోని రెడ్ వాల్తేట్, మద్దిలపాలెంలోని ఎస్ఎస్ఎన్ బేకరీ, ఎన్ఎస్‌టీఎల్ గేటు వద్ద గల పేస్ట్రీ చెఫ్ షాపుల్లో గడువు తీరిన ఆహార పదార్థాలు విక్రయిస్తున్నట్టు గుర్తించారు. కొన్నిచోట్ల రెండు, మూడేళ్ల కిందట గడువు తీరిన వస్తువులను కూడా వినియోగిస్తున్నారు.

# ఏపీలో విషాదకర ఘటన.. ఏమైందంటే..

అల్లూరి జిల్లా:ఆగస్టు 04((సందేశం టైమ్స్): రంపచోడవరంమండలం నిమ్మలపాలెంలో షార్ట్ సర్క్యూట్‌తో ) ఓ ఇంట్లో మంటలు వ్యాపించాయి. ఈ ప్రమాదంలో సాయి పల్లవి(6), తల్లి గాయత్రి (28) మృతిచెందారు. ఈ ఘటనతో గ్రామంలో విషాద ఛాయలు నెలకొన్నాయి. ఇంట్లో సాయి పల్లవిని వదిలేసి తల్లి గాయత్రి పనుల్లో మునిగిపోయింది. ఈ సమయంలో టీవీ చూస్తూ సాయి పల్లవి పడుకుండిపోయారు. అయితే, ఇంట్లో ఆకస్మాత్తుగా మంటలు వ్యాపించడంతో ఈ అగ్ని ప్రమాదం జరిగింది. అగ్నిప్రమాదానికి గురైన కూతురిని కాపాడుకునే సమయంలో మంటల్లో తల్లికూతుళ్లు చిక్కుకున్నారు. మంటల్లో కాలిపోయిన తల్లి కూతుళ్లను వెంటనే స్థానిక ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యలో తల్లీబిడ్డ మృతిచెందారు. ఈ ఘటనతో కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.




# క్రీడావార్తలు




## ఇలా చేస్తే ఇంగ్లాండ్‌ను 33వ సారి టీమిండియా ఓడించవచ్చు..




టీమిండియా చివరి టెస్ట్ లాస్ట్ దశకు వచ్చేసింది. ఈ మ్యాచులో ఇంగ్లండ్ జట్టు విజయానికి 35 పరుగులు అవసరం. భారత్ జట్టు సిరీస్ సమం చేయాలంటే మిగిలిన నలుగురిని ఔట్ చేయాలి. ఇలాంటి సమయంలో టీమిండియా గెలువడంతోపాటు, ఇంగ్లాండ్‌తో సిరీస్ స్కోరు సమం చేసుకునే ఛాన్స్ కూడా ఉందని నిపుణులు చెబుతున్నారు.%ఇంతకు ముందు 32 సార్లు చేసినట్లుగానే ఇంగ్లండ్‌తో చేయాలని అంటున్నారు. 33వ సారి కూడా వారిని అదే విధంగా ఓడించాలని సూచిస్తున్నారు. ముందు సెషన్‌లో గెలవడం గురించి మాట్లాడే కెప్టెన్ల ప్రకటనలను మీరు అర్థం చేసుకోవాలి. 33వ సారి ఇంగ్లండ్‌ను ఓడించడం కూడా ఇదే సూచిస్తుంది.టెస్ట్ మ్యాచ్‌లో సెషన్ చాలా ముఖ్యం. 5 రోజుల ఆటలో మొత్తం 15 సెషన్‌లు ఉంటాయి. దీని ప్రకారం టీమిండియా, ఇంగ్లండ్ మధ్య జరిగే 5 టెస్ట్ సిరీస్‌లో మొత్తం 75 సెషన్‌లు ఉంటాయి. ఓవల్ టెస్ట్‌లో 5వ రోజు ఆట ప్రారంభమైనప్పుడు, అది సిరీస్‌లోని 13వ, 73వ సెషన్‌లో ప్రారంభం అవుతుంది. సిరీస్‌లోని మొదటి 71 సెషన్‌లలో 32 సెషన్‌లను టీమ్ ఇండియా గెలుచుకుంది. ఇప్పుడు అదే శైలిలో 73వ సెషన్‌ను గెలిస్తే, అది సిరీస్‌లో 33వ సెషన్ విజయం మాత్రమే కాదు, ఓవల్ టెస్ట్‌లో విజయాన్ని సాధించవచ్చు.భారత్-ఇంగ్లండ్ టెస్ట్ సిరీస్‌లో ఇప్పటివరకు ఆడిన 71 సెషన్ల గురించి మాట్లాడుకుంటే, భారతదేశం 32 విజయాలతో పోలిస్తే ఇంగ్లండ్ 21 సెషన్లలో గెలిచింది. రెండు జట్ల మధ్య 18 సెషన్లు డ్రా అయ్యాయి. అంటే, వాటిలో ప్రదర్శన స్థాయి సమానంగా ఉంది. ఇందులో, ఎడ్జ్‌బాస్టన్‌లో జరిగిన రెండో టెస్ట్ మ్యాచ్‌లో కేవలం 14 సెషన్‌లు మాత్రమే జరిగాయి.ఈ క్రమంలో ఓవల్ టెస్ట్ 5వ రోజు మొదటి గంట ఆట చాలా కీలకం కానుంది. భారీ రోలర్ కారణంగా, పిచ్ బ్యాటింగ్‌కు అద్భుతంగా ఉంటుందని చెబుతున్నారు. భారత బౌలర్లు ఆ ప్రతికూల పరిస్థితులను తమకు అనుకూలంగా మార్చుకోవాలి. అప్పుడు సెషన్ మాత్రమే కాదు, టెస్ట్ మ్యాచ్ కూడా మనదే అవుతుంది. దీంతో సిరీస్ 2-2తో సమం చేసుకోవచ్చు.

## చివరి బంతికి హోల్డర్ బౌండరీ



%లాడర్‌హిల్ (ఫ్లోరిడా): పొట్టి క్రికెట్ ఫ్యాన్స్‌లో ఎందుకంత క్రేజో నిరూపించింది వెస్టిండీస-పాకిస్థాన్ రెండో టీ20. శనివారం రాత్రి జరిగిన ఉత్కంఠ పోరులో ఆఖరి బంతికి విజయం అందుకున్న విండీస్ మూడు మ్యాచ్‌ల సిరీసలో 1-1తో సమంగా నిలిచింది. బౌలింగ్‌లో తొలుత నాలుగు వికెట్లతో పాకిస్థాన్‌ను కట్టడి చేసిన ఆల్‌రౌండర్ జాసన్ హోల్డర్ (4/19, 16 నాటౌట్)..చివరి బంతికి బౌండరీ బాది విండీసను విజయ పథాన నిలిపాడు. మ్యాచ్‌లో తొలుత పాక్ 20 ఓవర్లలో 133/9 స్కోరుకు పరిమితమైంది. హసన్ నవాజ్ (40) టాప్ స్కోరర్. మోటీ 2 వికెట్లు తీశాడు. ఛేదనలో విండీస్ 20 ఓవర్లలో 135/8 స్కోరు చేసి నెగ్గింది. మోటీ (28), హోప్ (21) పర్లేదనిపించారు. ఆఖరి ఓవర్లో 8 రన్స్ కావాల్సిన వేళ..అఫ్రీది రెండో బంతికి షెఫర్డ్‌ను అవుట్ చేశాడు. హోల్డర్‌తోపాటు కొత్త బ్యాటర్ షామర్ జోసెఫ్ తుదుపరి మూడు బంతుల్లో మూడు పరుగులే చేశారు. మరుసటి బంతిని అఫ్రీది వైడ్‌గా వేయడంతో.. చివరి బంతికి విండీస్ మూడు రన్స్ చేయాలి. ఈ దశలో ఒత్తిడిని అదిమిపట్టిన హోల్డర్ బంతిని బౌండరీకి తరలించి జట్టుకు అద్భుత విజయాన్ని అందించాడు.

## సిరాజ్ నియంత్రణ కోల్పోయి



ఐదో టెస్టు నాలుగో రోజు ఆటలో హ్యారీ బ్రూక్ మెరుపు శతకం అత్యంత కీలకంగా నిలిచింది. అయితే అతను 19 పరుగుల వద్దే వెనుదిరగాల్సింది. ప్రసిద్ధ్ ఓవర్‌లో బ్రూక్ భారీ షాట్ ఆడగా గాల్లోకి లేచిన బంతిని ఫైన్ లెగ్‌లో సిరాజ్ అందుకున్నాడు. కానీ నియంత్రణ కోల్పోయిన సిరాజ్ బౌండరీ లైన్‌ను తాకడంతో అది కాస్తా సిక్స్‌గా మారింది. ఇక అదే ఓవర్‌లో రెండు ఫోర్లు బాదిన బ్రూక్ మరో 91 పరుగులు సాధించి సెంచరీ పూర్తి చేయడమే కాదు.. రూట్‌తో కలిసి భారీగా పరుగులు జత చేసి భారత్‌పై తీవ్ర ఒత్తిడి పెంచాడు. బ్రూక్ ముందే అవుటై ఉంటే ఈ టెస్టులో గిల్ సేన పరిస్థితి మరింత మెరుగ్గా ఉండేది .

## నా రికార్డు కంటే గిల్ ఇంగ్లండ్ ప్రదర్శన అత్యుత్తమం.. గిల్‌కు గవాస్కర్ బహుమతి..




టీమిండియా కెప్టెన్ అయిన తొలి సిరీస్‌లోనే శుభ్‌మన్ గిల్ అదరగొట్టాడు. బ్యాట్‌తో అద్భుతమైన పెర్ఫార్మెన్స్ ఇచ్చాడు. తాజా ఇంగ్లండ్ సిరీస్‌లో పది ఇన్నింగ్స్‌ల్లో 754 పరుగులు చేశాడు మరో 21 పరుగులు చేసి ఉంటే సునీల్ గవాస్కర్ (771) రికార్డును బద్దలుగొట్టేవాడు. ఆ రికార్డును గిల్ త్రుటిలో మిస్ అయ్యాడు. అయితే గిల్ ఆ రికార్డును బద్దలుకొట్టలేకపోయినప్పటికీ అప్పటి తన పెర్ఫార్మెన్స్‌తో పోల్చుకుంటే తాజా గిల్ ప్రదర్శనే అత్యుత్తమని గవాస్కర్ కొనియాడాడు.'ఒక సిరీస్‌లో 754 పరుగులు చేయడం అంటే సాధారణ విషయం కాదు. నా రికార్డును బద్దలుకొట్టలేకపోయి ఉండొచ్చు. కానీ, కెప్టెన్‌గా తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటూ గిల్ చేసిన ఈ ప్రదర్శన నా రికార్డు కంటే అత్యుత్తమం. కెప్టెన్‌గా తొలి సిరీస్‌లో నేను ఈ స్థాయిలో ఆడలేదు. ఆ రికార్డు నెలకొల్పినపుడు నేను చిన్న పిల్లాడిని. నా మీద ఎలాంటి ఒత్తిడీ లేదు. నేను ఫెయిల్ అయినా నన్నెవరూ ప్రశ్నించలేరు. కానీ, ఇప్పుడు గిల్ పరిస్థితి వేరు. ఎలా చూసుకున్నా నా రికార్డు కంటే గిల్ తాజా ప్రదర్శన చాలా గొప్పది' అని గవాస్కర్ పేర్కొన్నాడు.తన రికార్డును బద్దలుకొట్టలేకపోయినప్పటికీ గిల్‌ను ప్రశంసిస్తూ అతడికి గవాస్కర్ ఓ బహుమతిని అందజేశాడు. తన సంతకంతో కూడిన టోపీని, టీషర్ట్‌ను అందించాడు. తాను చాలా తక్కువ మందికి మాత్రమే తన సంతకంతో కూడా టోపీని అందిస్తానని ఈ సందర్భంగా గిల్‌తో గవాస్కర్ వ్యాఖ్యానించాడు. మైదానంలో గిల్‌ను అభినందించాడు.

## అనిరుధ్ జోడీకి లెక్సింగ్టన్ ట్రోఫీ



లెక్సింగ్టన్(యూఎస్): హైదరాబాద్ టెన్నిస్ ఆటగాడు అనిరుధ్ చంద్రశేఖర్ అంతర్జాతీయ వేదికపై మెరిశాడు. సహచరుడు రామ్‌కుమార్‌తో కలిసి యూఎస్‌లో జరిగిన లెక్సింగ్టన్ చాలెంజర్ టోర్నీ డబుల్స్ టైటిల్‌ను కైవసం చేసుకున్నాడు. ఆదివారం జరిగిన ఫైనల్లో అనిరుధ్/రామ్ జోడీ 6-4, 6-4తో తైపీ జంట యు హిషియు-హెు హువాంగ్‌పై గెలిచింది.

## రసపట్టులో అద్భుత శతకాలతో ఆఖరి మ్యాచ్




లండన్: ఓవల్ టెస్టులో హైటెన్షన్.. నాలుగో రోజే ముగుస్తుందనుకున్న మ్యాచ్ ఆఖర్లో వర్షం ఇచ్చిన ట్విస్ట్‌కు ఐదో రోజుకు చేరింది. అయితే హ్యారీ బ్రూక్ (111), జో రూట్ (105) అద్భుత శతకాలతో ఆఖరి మ్యాచ్‌నే కాదు, సిరీస్ కూడా కోల్పోయినట్టే అనుకున్న వేళ.. భారత జట్టు అనూహ్యంగా పుంజుకుంది. చివరి సెషన్‌లో కేవలం 57 పరుగుల కోసం బరిలోకి దిగిన ఆతిథ్య జట్టును భారత పేసర్లు వణికించారు. ప్రసిద్ధ్ కృష్ణ వరుస ఓవర్లలో రెండు వికెట్లు తీసి భారత్ విజయంపై ఆశలు రేపాడు. అయితే వర్షం రావడంతో గంటన్నర ముందుగానే ఆటను ముగించారు. విజయానికి ఇంగ్లండ్ 35 పరుగుల దూరంలో ఉండగా.. వోక్స్ బరిలోకి దిగితే భారత్‌కు మరో 4 వికెట్లు కావాల్సిందే. ప్రస్తుతం ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్‌లో 339/6 స్కోరుతో ఉండగా.. క్రీజులో జేమీ స్మిత్ (2), ఒవర్టన్ (0) ఉన్నారు. ప్రసిద్ధ్‌కు మూడు, సిరాజ్‌కు రెండు వికెట్లు దక్కాయి. సోమవారం తొలి గంట ఆట ఇరు జట్లలో విజయం ఎవరిదో తేల్చనుంది.పోటీ సమంగా..: ఓవర్‌నైట్ స్కోరు 50/1తో నాలుగో రోజు ఇంగ్లండ్ భారీ ఛేదనను ఆరంభించింది. అయితే ఈ సెషన్‌లో ఇరుజట్ల నుంచి పోటాపోటీ ప్రదర్శన ఎదురైంది. ముఖ్యంగా పేసర్ సిరాజ్ అలుపెరుగని ఎనిమిది ఓవర్ల స్పెల్‌తో డకెట్, పోప్‌లను ఇబ్బందిపెట్టాడు. అయితే జోరుమీదున్న డకెట్‌ను తొలి గంటలోనే ప్రసిద్ధ్ అవుట్ చేశాడు. అటు పోప్ మాత్రం ప్రసిద్ధ్ ఓవర్‌లో మూడు ఫోర్లు రాబట్టాడు. కానీ తర్వాతి ఓవర్‌లోనే అతడిని సిరాజ్ అవుట్ చేశాడు. ఇక బ్రూక్ నిలదొక్కుకునేందుకు కాస్త సమయం తీసుకున్నా.. ఆకాశ్ ఓవర్‌లో 4,6తో టచ్‌లోకి వచ్చాడు. తర్వాతి ఓవర్‌లోనే 6,4,4తో 16 రన్స్ పిండుకున్నాడు. ఈ సెషన్‌లో ఇంగ్లండ్ రెండు వికెట్లు కోల్పోయినా 114 పరుగులు రాబట్టింది.బ్రూక్ భళా: రెండో సెషన్‌లో ఇంగ్లండ్ తమ బాజ్‌బాల్ గేమ్‌ను బయటికి తీసింది. విజయానికి 210 పరుగుల దూరంలో ఉండగా.. బ్రూక్ ఒక్కసారిగా బ్యాట్‌కు పనిజెప్పాడు. దీంతో సెషన్ ముగిసేసరికి అతను అద్భుత శతకం పూర్తిచేసుకోగా.. అటు రూట్ 98 రన్స్‌తో బ్రేక్‌కు వెళ్లాడు. దీంతో.. ఇంగ్లండ్ విజయానికి కేవలం 57 పరుగుల దూరంలో నిలిచి భారత్‌లో ఓటమి భయాన్ని పెంచింది. కాగా.. ఆరంభ ఓవర్‌లోనే బ్రూక్ రెండు ఫోర్లతో తన ఉద్దేశాన్ని చాటాడు. అటు భారత పేసర్లు తీవ్రంగా అలసిపోయినట్టు కనిపించారు. ఈ క్రమంలో 39 బంతుల్లోనే ఫిఫ్టీ పూర్తి చేసిన బ్రూక్, ఆ తర్వాత కూడా చెలరేగి 91 బంతుల్లో కెరీర్‌లో పదో శతకం అందుకున్నాడు.

## భారత జోడీలకు రన్నరప్ టైటిళ్లు




న్యూఢిల్లీ: బ్రెజిల్‌లో జరిగిన ప్రపంచ టేబుల్ టెన్నిస్ (డబ్ల్యూటీటీ) స్టార్ కంటెండర్ టోర్నీలో భారత జోడీలు రన్నరప్ టైటిళ్లతో సరిపెట్టుకున్నాయి. మిక్స్‌డ్ డబుల్స్ ఫైనల్లో భారత ద్వయం మానుష్ షా/దియా చిటాలే 4-11, 11-8, 11-5, 5-11, 2-11తో జపాన్ జంట సతోషి/హినొకా చేతిలో ఓటమి పాలైంది. పురుషుల డబుల్స్ టైటిల్‌పోరులో భారత జోడీ మానుష్/మానవ్ 3-11, 11-7, 7-11, 15-13, 5-11తో జర్మనీకి చెందిన బెనెడిక్ట్/డాంగ్ చేతిలో పరాజయం పాలైంది. ఇక మహిళల సింగిల్స్ క్వార్టర్స్‌లో మనికా బాత్రా 7-11, 6-11, 7-11తో హషిమోటో (జపాన్) చేతిలో ఓడింది.

# బిజినెస్



## 24500 వద్ద నిలదొక్కుకోవడం కీలకం

నిఫ్టీ గత వారంలో కూడా నిఫ్టీ మైనర్ రికవరీతో ప్రారంభమైనా కీలక స్థాయి 25,000 వద్ద నిలదొక్కుకోవడంలో విఫలమై వారం మొత్తానికి 270 పాయింట్ల నష్టంతో 24,565 వద్ద ముగిసింది. గత ఐదు వారాలుగా నిరంతర డౌన్‌ట్రెండ్‌లో ఉన్న మార్కెట్ గరిష్ఠ స్థాయి 25,670 నుంచి 1,000 పాయింట్ల మేరకు నష్టపోయింది. మిడ్‌క్యాప్‌– 100 సూచీ 1,370 పాయింట్లు, స్మాల్‌క్యాప్‌–100 సూచీ 625 పాయింట్లు నష్టపోయాయి. అలాగే నాలుగు నెలల వరుస ర్యాలీ అనంతరం జూలై నెలలో నిఫ్టీ 750 పాయింట్ల మేరకు నష్టపోయి ఇటీవల ఏర్పడిన బాటమ్‌ 24,500 సమీపంలోకి వచ్చింది.

## స్థిరంగా బంగారం ధర..

## ఈ రోజు బంగారం, వెండి ధరలు ఎలా ఉన్నాయంటే..

బంగారం ధర మళ్లీ లక్ష రూపాయలను దాటేసి ఆల్‌టైమ్ గరిష్టానికి చేరువ అవుతోంది. భౌగోళిక రాజకీయ అనిశ్చితుల నేపథ్యంలో పెట్టుబడిదారులు సురక్షిత ఆస్తుల వైపు మొగ్గు చూపుతుండడం బంగారం ధరల పెరుగుదలకు కారణంగా కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో ఈ రోజు (ఆగస్టు 4న) ఉదయం 6.30




గంటల సమయానికి 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ. రూ. 1, 01, 340కి చేరింది. 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. రూ. 92, 890కి చేరింది. నిన్నటితో పోల్చుకుంటే బంగారం ధర స్వల్పంగా తగ్గింది.ఢిల్లీలో 24 క్యారెట్ల పసిడి రేటు 10 గ్రాములకు రూ. 1, 01, 490కి చేరుకోగా, 22 క్యారెట్ల గోల్డ్ ధర 10 గ్రాములకు రూ. 93, 040కి చేరుకుంది.

## గత ఐదేళ్లలో అత్యధిక రాబడిని ఇచ్చిన టాప్ 3 మ్యూచువల్ ఫండ్స్




మనలో చాలా మంది మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడి పెట్టడానికి ప్రధాన కారణం డబ్బు త్వరగా పెరగాలని కోరుకోవడమే. ఒత్తిడి లేకుండా లాభాలు వచ్చేలా ఉండాలని భావిస్తుంటారు. కానీ అనేక మందికి కూడా ఎలాంటి ఫండ్లలో ఇన్వెస్ట్ చేయాలనే విషయాలు తెలియవు. అయితే (అసోసియేషన్ ఆఫ్ మ్యూచువల్ ఫండ్స్ ఇన్ ఇండియా) జూలై 31, 2025 డేటా ప్రకారం, గత ఐదేళ్లలో మంచి రాబడి ఇచ్చిన టాప్ మ్యూచువల్ ఫండ్స్ గురించి ఇక్కడ తెలుసుకుందాం

**1. స్మాల్ క్యాప్ - క్వాంట్ స్మాల్ క్యాప్ ఫండ్**

ఒకవేళ మీరు భారీ రాబడితోపాటు మార్కెట్‌లో హెచ్చుతగ్గులను తట్టుకోగలిగితే ఈ ఫండ్ మీకు సరిపోతుంది. గత ఐదేళ్లలో ఈ ఫండ్ ఏకంగా 40.17% వార్షిక రాబడిని ఇచ్చింది. దీని బెంచ్‌మార్క్ (నిఫ్టీ స్మాల్‌క్యాప్ 250 %ు=×%) అదే కాలంలో 32.74% ఇచ్చింది. అంటే, ఈ ఫండ్ తన బెంచ్‌మార్క్‌ను దాటి అద్భుతంగా పనిచేసింది. కానీ స్మాల్ క్యాప్ ఫండ్స్ చాలా రిస్క్‌తో కూడుకున్నవనే విషయం గుర్తుంచుకోవాలి. కాబట్టి ఈ ఫండ్ ఎంచుకునేవారు దీర్ఘకాలిక దృష్టితో ఉండాలి.

**2. మిడ్ క్యాప్ - మోతీలాల్ ఓస్వాల్ మిడ్‌క్యాప్ ఫండ్**

మిడ్ క్యాప్ ఫండ్స్ అంటే కొంత మందికి అంత ఆకర్షణగా కనిపించకపోవచ్చు. కానీ మోతీలాల్ ఓస్వాల్ మిడ్‌క్యాప్ ఫండ్ గత ఐదేళ్లలో సంవత్సరానికి 36.52% రాబడిని ఇచ్చింది. దీని బెంచ్‌మార్క్ ( 30.42% ఇచ్చింది. అంటే, ఈ ఫండ్ తన బెంచ్‌మార్క్‌ను దాటేసింది. స్మాల్ క్యాప్స్ కంటే దీనిలో కూడా కొంచెం రిస్క్ తక్కువగా ఉంటుంది.

**3. లార్జ్ క్యాప్ - నిప్పాన్ ఇండియా లార్జ్ క్యాప్ ఫండ్**

లార్జ్ క్యాప్ ఫండ్స్‌ను సాధారణంగా సురక్షితమైన పెట్టుబడిగా చూస్తారు. ఎందుకంటే, ఇవి రిలయన్స్, టీసీఎస్, ఇన్ఫోసిస్ లాంటి పెద్ద, బలమైన కంపెనీల్లో పెట్టుబడులు చేస్తాయి. ఈ ఫండ్ గత ఐదేళ్లలో సంవత్సరానికి 26.21% రాబడిని ఇచ్చింది. దీని బెంచ్‌మార్క్ 19.94% ఇవ్వడం విశేషం. కాబట్టి, మీరు స్థిరమైన రాబడి కావాలని చూస్తూ, ఎక్కువ రిస్క్ వద్దనుకుంటే ఈ ఫండ్ బెటర్. అయినా, %ాజుదీ×% దీన్ని కూడా రిస్క్‌తో కూడినదిగా గుర్తించింది. ఎందుకంటే ఇది ఈక్విటీ ఫండ్.

## లాభాల బాటలో సూచీలు..

## ఈ రోజు లాభాల్లో ఉన్న టాప్ స్టాక్స్ ఇవే..




గత వారం వరుసగా నష్టాలను చివచూసిన దేశీయ సూచీలు ఈ వారాన్ని కాస్త సానుకూలంగా ప్రారంభించాయి. కనిష్టాల వద్ద మదుపర్లు కొనుగోళ్లకు మొగ్గు చూపుతుండడంతో సూచీలు లాభాల బాటలో ఉన్నాయి. భారత్‌పై ట్రంప్ పన్నుల ఎఫెక్ట్, అంతర్జాతీయంగా మిశ్రమ సంకేతాలు ఉన్నప్పటికీ స్టాక్ మార్కెట్లు పాజిటివ్‌గా ట్రేడ్ అవుతుండడం విశేషం. ఈ నేపథ్యంలో ప్రస్తుతం సెన్సెక్స్, నిఫ్టీ లాభాల్లో కదలాడుతున్నాయి గత శుక్రవారం ముగింపు (80, 599)తో పోల్చుకుంటే సోమవారం ఉదయం లాభాలతో మొదలైన సెన్సెక్స్ ఆ తర్వాత మరింత లాభాలను ఆర్జించింది. ఒక దశలో దాదాపు 300 పాయింట్లు ఎగబాకి 80, 902 వద్ద గరిష్టానికి చేరింది. ప్రస్తుతం ఉదయం 10:20 గంటల సమయంలో సెన్సెక్స్ 142 పాయింట్ల లాభంతో 80, 742 వద్ద కొనసాగుతోంది. మరో వైపు నిఫ్టీ కూడా సెన్సెక్స్ బాటలోనే సాగుతోంది. ప్రస్తుతానికి 70 పాయింట్ల లాభంతో 24, 635 వద్ద కొనసాగుతోంది. సెన్సెక్స్‌లో యూపీఎల్, ఎమ్‌సీఎక్స్ ఇండియా, డెలివరీ, ట్యూబ్ ఇన్వెస్ట్‌మెంట్, సెయిల్ షేర్లు లాభాల్లో ఉన్నాయి. పీఎన్‌బీ హౌసింగ్ ఫైనాన్స్, ఏబీబీ ఇండియా, నువమా వెల్త్, గోద్రేజ్ కన్స్యూమర్, సీమన్స్ షేర్లు నష్టాల బాటలో కొనసాగుతున్నాయి. నిఫ్టీ మిడ్ క్యాప్ ఇండెక్స్ 316 పాయింట్ల లాభంతో ఉంది. బ్యాంక్ నిఫ్టీ 29 పాయింట్ల నష్టంతో కొనసాగుతోంది. డాలర్‌తో పోల్చుకుంటే రూపాయి మారకం విలువ 87.36గా ఉంది.

## ఐటీ లో కొలువుల్లేవ్

న్యూఢిల్లీ: దేశీయ ఇన్ఫర్మేషన్ అండ్ టెక్నాలజీ (ఐటీ) సంస్థల్లో నియామకాలు పూర్తిగా నిలిచిపోయాయి. గడచిన 6–7 త్రైమాసికాలుగా పలు ఐటీ కంపెనీలు నియామకాలను దాదాపు పక్కనబెట్టినట్లు రిక్రూట్‌మెంట్ సేవలందించే క్వెస్ కార్ప్ సంస్థ వెల్లడించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం సెప్టెంబరుతో ముగిసే ద్వితీయ త్రైమాసికంలోనూ ఇదే పరిస్థితి కొనసాగనుందని తెలిపింది. ప్రస్తుతం ఐటీ నిపుణుల డిమాండ్‌లో దాదాపు 73 శాతం గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్లు (జీసీసీ), నాన్ ఐటీ కంపెనీల నుంచే వస్తోంది తప్ప.. ఐటీ కంపెనీల నుంచి పెద్దగా లేదని క్వెస్ కార్ప్ సీఈఓ,ఈడీ గురుప్రసాద్ శ్రీనివాసన్ చెప్పారు. సేవలపై ఎక్కువగా ఆధారపడిన ఐటీ కంపెనీలైతే గత ఆరేడు త్రైమాసికాలుగా నియామకాలను పూర్తిగా నిలిపివేసాయని




ఆయన తెలిపారు. కొన్ని ఐటీ సేవల కంపెనీలైతే ఉన్న ఉద్యోగులకే ఇక సెలవు అని చెబుతున్నాయి. జీసీసీలు, నాన్ ఐటీ కంపెనీలు కూడా ఏఐ, క్లౌడ్ కంప్యూటింగ్, సైబర్ సెక్యూరిటీ రంగాల్లో నైపుణ్యాలు ఉన్న ఉద్యోగులనే ఎక్కువగా నియమించుకుంటున్నాయని శ్రీనివాసన్ తెలిపారు.

## ఐటీఆర్ ఫైలింగ్ గడుపు పొడిగింపు..

## ఈ తప్పులు మాత్రం చేయకండి..




కేంద్ర ప్రభుత్వం పన్ను చెల్లింపుదారులకు ఉపశమనం కల్పించింది. ఇన్‌కమ్‌ట్యాక్స్ రిటర్న్ ఫైలింగ్ తుది గడువును పొడిగింది. ఈ ఏడాది జులై 31వ తేదీతో ముగియాల్సిన ఐటీఆర్ ఫైలింగ్ తుది గడువును సెప్టెంబర్ 15 వరకు పొడిగించింది. ఎటువంటి డిమాండ్ లేకుండా ప్రభుత్వం రిటర్న్ దాఖలు చేసే తేదీని పొడిగించడం ఇదే మొదటిసారి. ఐటీఆర్ ఫారమ్‌లో అనేక ముఖ్యమైన మార్పుల కారణంగా ఈసారి సీబీడీటీ ఆదాయపు పన్ను రిటర్న్‌లను దాఖలు చేయడానికి తేదీని పొడిగించింది.

## హెచ్‌సీఎల్ టెక్ సీఈఓ వేతనం రూ 94.6 కోట్లు

న్యూఢిల్లీ: దేశీయ ఐటీ సంస్థ హెచ్‌సీఎల్ టెక్ సీఈఓ విజయ్ కుమార్ వేతనం విషయంలో ప్రస్తుతం దేశంలోని టెక్ దిగ్గజాల సారథుల కన్నా ఎంతో ముందున్నారు. 2024–25 ఆర్థిక సంవత్సరంలో ఆయన వేతనం రూ. 94.6 కోట్లు (1.085 కోట్ల డాలర్లు). దేశీయ ఐటీ దిగ్గజ సంస్థ టీసీఎస్ సీఈఓ కృతివాసన్ (రూ. 26.52 కోట్లు), ఇన్ఫోసిస్ సీఈఓ సలీల్ పరేఖ్ (రూ. 80.62 కోట్లు) ఆయన కన్నా ఎంతో వెనుకబడి ఉన్నారు. అంతేకాదు... 2025–26 ఆర్థిక సంవత్సరానికి విజయ్ కుమార్ వేతనం 71చ మేర పెంచేందుకు (అంటే రూ. 154 కోట్లు లేదా 1.86 కోట్ల డాలర్లు) హెచ్‌సీఎల్ టెక్ డైరెక్టర్ల బోర్డు ఇప్పటికే ఆమోదం తెలిపింది. మరోవైపు విప్రో సీఈఓ శ్రీనివాస్ పల్లియా (రూ. 53.64 కోట్లు), టెక్ మహీంద్రా సీఈఓ మోహిత్ జోషి (రూ. 53.9 కోట్లు) కూడా విజయ్ కన్నా ఎంతో వెనుకబడి ఉన్నారు.విజయ్



వేతనంలో మూల వేతనం 19.6 లక్షల డాలర్లు కాగా పనితీరు ఆధారిత బోన్‌సగా 17.3 లక్షల డాలర్లున్నట్లు

## వస్తున్నాయ్ భారత్ సహకార ట్యాక్సీలు

న్యూఢిల్లీ: సహకార రంగంలోని కొన్ని సహకార సంఘాల కన్సార్షియం ఈ ఏడాది చివరి నాటికి "భారత్" బ్రాండ్‌తో దేశంలో సహకార ట్యాక్సీ సర్వీసును ప్రవేశపెట్టబోతోంది. ప్రస్తుతం దేశంలో నడుస్తున్న ఓలా, ఉబర్ వంటి ట్యాక్సీ సర్వీసులకు సవాలు విసిరేందుకు సహకార సంఘం సంసిద్ధం అవుతోంది. ఈ ప్రయత్నంలో భాగంగా ఇప్పటికే రూ. 300 కోట్ల అధీకృత మూలధనంతో ఢిల్లీ, గుజరాత్, ఉత్తర ప్రదేశ్, మహారాష్ట్రల్లో 200 మంది డ్రైవర్లను నియమించుకుంది. జాతీయ సహకార అభివృద్ధి సంస్థ (ఎన్‌సీడీసీ), ఇఫ్కో, గుజరాత్ సహకార పాల మార్కెటింగ్ ఫెడరేషన్ (జీసీఎంఎంఎఫ్) సహా ఎనిమిది సంఘాలు ఇందులో భాగస్వాములుగా ఉన్నాయి. డ్రైవర్లకు మెరుగైన రాబడులు అందించడంతో పాటు ప్రయాణికులకు సరసమైన ధరల్లో ట్యాక్సీ సర్వీసును అందుబాటులోకి తేవడం దీని లక్ష్యమని ఎన్‌సీడీసీ డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ రోహిత్ గుప్తా అన్నారు.

TGTEL/25/A0348 TITLE: Sandhesham Times 3-82,Ananthagiri, Singavaram, SURYAPET, Telangana,508 206 Gmail : sandeshamtimes@gmail.com Website:https://sandeshamtimes.com Publisher Press (Name & Address) SUNDAY PRINTING PRESS 3-4297,SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR, ANDHRA PRADHESH-522 006